

మహా దుబారా

జి-20 సన్నాహక సదస్సు పేరుతో రూ.115.71 కోట్లతో జీవీఎంసీ పనులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జి-20 సదస్సు పేరుతో జీవీఎంసీ రూ.115.71 కోట్లు వెచ్చించి చేపట్టిన పనులు మూన్నాళ్ల ముచ్చటగా మారిపోయాయి. 2023 మార్చిలో జి-20 దేశాల కాన్క్లేవ్‌కు నగరం ఆతిథ్యమిచ్చిన విషయం తెలిసిందే. ప్రపంచంలోని 40కిపైగా దేశాల నుంచి ప్రతినిధులు వస్తున్నందున నగరాన్ని సుందరంగా ముస్తాబు చేయాలని జీవీఎంసీ అధికారులను అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆదేశించింది. దీంతో నగర పాలక సంస్థ రూ.115.71 కోట్లతో అనేక పనులు చేపట్టింది. అవి ఇప్పుడు ఎలా ఉన్నాయో 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి పరిశీలించగా దారుణమైన పరిస్థితులు కనిపించాయి. పనుల్లో నాణ్యత లేకపోవడంతో రెండేళ్లు గడవకుండానే ఆనవాళ్లు కోల్పోయాయి.

ఆంధ్రజ్యోతి విజిట్

ప్రతినిధులు ప్రయాణించే మార్గంలో సుమారు రూ.27.55 కోట్లతో కొత్తగా తారురోడ్ల నిర్మాణం చేపట్టారు. అదేవిధంగా ఎయిర్‌పోర్టు నుంచి ఎన్‌ఏడీ జంక్షన్, తాటిచెట్లపాలెం జంక్షన్, రైల్వే స్టేషన్, తెలుగుతల్లి ఫ్లై ఓవర్‌బ్రిడ్జి మీదుగా నోవాటెల్ హోటల్ వరకు, బీచ్‌రోడ్డులో కోస్టల్ బ్యాటరీ నుంచి సదస్సు జరిగే రాడిసన్ బ్లూ హోటల్ వరకూ రూ.3.1 కోట్లతో ఆర్నమెంట్ లైటింగ్ పేరుతో విద్యుత్ స్తంభాలకు రోప్ లైటింగ్, బీచ్ వైపు ఉండే చెట్లకు సీరియల్ సెట్ లైటింగ్ అమర్చారు. తెన్నేటి పార్కు, సీతకొండ వద్ద రాళ్లపై రూ.28.9 కోట్లు వెచ్చించి రాళ్లపై బొమ్మలు వేయించారు. సీతకొండ వ్యూపాయింట్‌తో పాటు ఆర్కే బీచ్ రోడ్డులో సోలార్ ట్రీలను ఏర్పాటుచేశారు. వీటికి ఒక్కోదానికి రూ.69 లక్షల వరకూ వెచ్చించారు. అదేవిధంగా బీచ్‌రోడ్డులో రూ.23.4 కోట్లతో ఫుట్‌పాత్‌ల మరమ్మతులు, కొత్తవి నిర్మాణం చేపట్టారు. రూ.5.42 కోట్లతో బీచ్‌రోడ్డులో డివైడర్లు, సెంటర్‌మీడియన్లకు రిపేర్లు చేసి రంగులు వేయించారు. సాగర్‌నగర్ ఆర్చ్ ఎదురుగా కొత్తబీచ్ అభివృద్ధి పేరుతో గుడ్లవానిపాలెం వద్ద రూ.90 లక్షల వెచ్చించి చెట్లు నాటడం, ఇతర సదుపాయాలు కల్పించడం చేశారు. అతిథులు వాహనాల్లో ప్రయాణించినప్పుడు రోడ్డు పక్కన ఉండే గోడలు ఆకర్షనీయంగా కనిపించేందుకంటూ రూ.1.67 కోట్లు వెచ్చించి రైల్వేస్టేషన్, డీఆర్ఎం కార్యాలయం, ఎన్ఏడీ జంక్షన్ నుంచి తాటిచెట్లపాలెం జంక్షన్ వరకు జాతీయ రహదారి పక్కన ఉండే గోడలకు పెయింటింగ్‌లు వేయించారు. సీతకొండ వద్ద వ్యూపాయింట్ అభివృద్ధి పేరుతో రూ.2.3 కోట్లు ఖర్చుపెట్టారు. అక్కడ ఫొటోలు దిగేందుకు

... మిగతా 6వ పేజీలో



బీచ్‌రోడ్డులో జీ20 సదస్సు సమయంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ (ప్రస్తుతం ధ్వంసమైన దృశ్యం)




కనిపించని రోప్ లైటింగ్, సీరియల్ సెట్ లైటింగ్

బీచ్‌రోడ్డుతోపాటు నగరంలోని కొన్ని ప్రధాన రహదారుల మధ్యలో విద్యుత్ స్తంభాలకు, చెట్లపై రాత్రిపూట ఆకర్షణీయంగా కనిపించేందుకు సీరియల్ సెట్ల లైటింగ్ ఏర్పాటుకోసం సుమారు రూ.3.1 కోట్లు వెచ్చించారు. బీచ్‌రోడ్డులో చెట్లపై ఏర్పాటుచేసిన సెట్లు కొద్దిరోజులకే పోయాయి. స్తంభాలకు ఏర్పాటుచేసిన రోప్ లైటింగ్ కొన్నిచోట్ల మినహా ఎక్కడా వెలగడం లేదు. అయినప్పటికీ రోప్ లైటింగ్ నిర్వహణ పేరుతో ఏడాదికి రూ.50 లక్షలు చొప్పున కాంట్రాక్టర్‌కు జీవీఎంసీ అధికా రులు చెల్లిస్తున్నారు. దీనిపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు ప్రచురించడంతో అధికారులు స్పందించి, కాంట్రాక్టర్‌తో కొన్నిచోట్ల లైట్లు వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

రెండేళ్లు కాకముందే ఆనవాళ్లు కరవు

- బీచ్‌రోడ్డులో దెబ్బతిన్న ఫుట్‌పాత్‌లు
- దిష్టిబొమ్మల్లా సోలార్ ట్రీస్
- వెలసిపోయిన రాక్ పెయింటింగ్‌లు
- కనిపించని బయో రెమిడేషన్ ప్లాంట్లు
- మిణుకు మిణుకుమంటున్న రోప్ లైటింగ్, సీరియల్ లైటింగ్
- నాణ్యతా లోపమే కారణం

సీతకొండ వద్ద వెలసిపోయిన రాక్ పెయింట్





పోలీస్ మెస్ వద్ద పనిచేయని సోలార్ ట్రీ

దిష్టిబొమ్మల్లా సోలార్ ట్రీలు

ఆర్కే బీచ్, సీతకొండ వద్ద రూ.69 లక్షలు వెచ్చించి ఏర్పాటుచేసిన సోలార్ ట్రీలు మూలకు చేరిపోయాయి. ఆ చెట్లకు అమర్చిన ఆకులను పోలి ఉండే ఆరు సోలార్ ప్యానల్స్‌పై పగలంతా సూర్యరశ్మి పడితే, అవి చార్జింగ్ అయి, చీకటిపడగానే ప్యానల్స్ కింద అమర్చిన లైట్లు వెలుగు తాయి. చీకట్లో చెట్టు రూపంలో వెలుతురు కనిపిస్తే సందర్శకులను ఆకట్టుకుంటుందని అధికారులు గొప్పగా చెప్పారు. కానీ ఆ చెట్లు కొద్దిరోజులకే మూలకు చేరిపోయాయి. ఒక్కో చెట్టుకు ఒకటి, రెండు లైట్లు మాత్రమే మిణుకుమిణుకుమంటూ వెలుగుతున్నాయి.

ఫుట్‌పాత్‌పై టైల్స్ లేచిపోతున్నాయ్

బీచ్‌రోడ్డులో ఫుట్‌పాత్‌ల నిర్మాణానికి రూ.23.4 కోట్లు వెచ్చించినప్పటికీ ప్రస్తుతం టైల్స్ లేచిపోతున్నాయి. నిర్మాణంలో నాణ్యత లేకపోవడమే కారణం. బీచ్‌రోడ్డులో డివైడర్లకు తెలుపు, పసుపు రంగులు ఉంటే, జీ-20 సమయంలో వాటిపై తెలుపు, నలుపు రంగులు వేశారు. అయితే జీ-20 సమయంలో వేసిన రంగులు నాణ్యత లేనివి కావడంతో ప్రస్తుతం వెలసిపోయి, గతంలో డివైడర్లకు వేసిన పసుపు, తెలుపు రంగులు బయటకు కనిపిస్తున్నాయి.



సీతకొండ వ్యూపాయింట్ వద్ద ఫుట్‌పాత్‌పై లేచిపోయిన టైల్స్

వెలసిపోయిన రాక్ పెయింట్‌లు

సీతకొండ, తెన్నేటి పార్కు వద్ద బీచ్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొండరాళ్లపై నియాన్ పెయింటింగ్స్ పేరుతో రూ.29 లక్షలు వెచ్చించి వివిధ రకాల జంతువులు, ఇతర బొమ్మలు గీయించారు. ప్రస్తుతం ఆయా చిత్రాలు వర్షాలకు వెలసిపోవడంతో కళావిహీనంగా కనిపిస్తున్నాయి. పెయింటింగ్స్ పేరుతో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయంటూ అప్పట్లోనే పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి.

దిగొచ్చిన కూరగాయల ధరలు



- టమాటా రూ.10-14
- బంగాళాదుంప రూ.16-20
- క్యాబేజీ, కాలీఫ్లవర్ కిలో రూ.12
- చిక్కుళ్లు రూ.22
- వంకాయలు రూ.22
- ఉల్లి రూ.26
- వీధుల్లో వ్యాపారుల విక్రయాలు
- వెలవెలబోతున్న రైతుబజార్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మార్కెట్‌లో కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టాయి. ఈ సీజన్‌లో పండే అన్ని రకాల కూరగాయలు డిమాండ్‌కు మించి మార్కెట్‌కు వస్తుండడంతో ధరలు బాగా తగ్గాయి. ముఖ్యంగా ఇది సీజన్ కావడంతో టమాటా భారీగా వస్తోంది. సాధారణంగా చిత్తూరు జిల్లా మదనపల్లె నుంచి టమాటా దిగుమతి అవుతుంది. అయితే స్థానికంగా రైతులు వేసిన పంట ఎక్కువగా రావడంతో దిగుమతులు నిలిపివేశారు. నెల క్రితం కిలో రూ.30 చొప్పున అమ్ముడైన టమాటా ఇప్పుడు రూ.10 నుంచి రూ.14 మధ్య లభిస్తోంది.

రైతుబజార్లలో మంగళవారం కిలో రూ.13గా నిర్ణయించారు. ఇదే టమాటాను రోజువారీ వ్యాపారులు వీధుల్లోకి తీసుకువెళ్లి మూడు కిలోలు రూ.50కి అమ్ముతున్నారు. అదేవిధంగా ఆమధ్య ఉల్లిపాయల ధర కిలో రూ.40 వరకు వెళ్లింది. ఎక్కువ కాలం కిలో రూ.36 చొప్పున రైతుబజార్లలో విక్రయించారు. ఇప్పుడు కొత్త ఉల్లి అందుబాటులోకి రావడంతో ధర తగ్గింది. కిలో రూ.26కే ఇస్తున్నారు. బయట ఆటోల్లో వంద రూపాయలకు మూడు కిలోలు చొప్పున ఇస్తున్నారు. బంగాళాదుంపలు ఎక్కువ కోల్‌కతా నుంచి వస్తాయి. ఏజెన్సీ నుంచి గిరిజన రైతులు కొత్త దుంపలు తీసుకురావడంతో ధరలు తగ్గాయి. గతంలో కిలో రూ.30పైనే పలికిన దుంపలు ఇప్పుడు కేవలం రూ.16 నుంచి రూ.20కే ఇస్తున్నారు. క్యాబేజీ, కాలీఫ్లవర్‌లు గత నెలలో కిలో రూ.30 చొప్పున విక్రయించారు. ఇప్పుడు ఈ రెండూ కిలో రూ.12కే దొరుకుతున్నాయి. క్యారెట్ ఒక సమయంలో కిలో రూ.60 చొప్పున విక్రయించారు. ఇటీవల కిలో రూ.50కి దిగి రావడం కష్టమైంది. ఇప్పుడైతే కిలో రూ.22కే దొరుకుతోంది. దేవుడు చిక్కుళ్లు కిలో రూ.58 ఉండేవి. ఇప్పుడు రూ.22కి ఇస్తున్నారు. వంకాయలు కిలో రూ.40 పలికేవి. ఇవి కూడా కిలో

... మిగతా 6వ పేజీలో

రోడ్డు ప్రమాదంలో బంగ్లాదేశ్ విద్యార్థిని మృతి

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):



శషోతినాగ్ (ఫైల్ ఫొటో)

విశాఖ నగరంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బంగ్లాదేశ్‌కు చెందిన శషోతినాగ్ (19) మృతి చెందింది. శషోతినాగ్ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బి.ఫార్మసీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఎం.వి.పి.కాలనీ సెక్టార్-10లో గల ఫారిన్ స్టూడెంట్స్ హాస్టల్‌లో ఉంటోంది. సోమవారం వసంత పంచమిని పురస్కరించుకుని వర్సిటీలో చదువుకుంటున్న వంద మంది బంగ్లాదేశ్ విద్యార్థులు ఏయూ ప్లాటినం జూబ్లీహాలులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆ కార్యక్రమం ముగిసిన తర్వాత ఏయూలోనే బి.ఫార్మసీ మూడో సంవత్సరం చదువుతున్న బంగ్లాదేశ్‌కు చెందిన రేవన్ దాస్ ద్విచక్ర వాహనంపై చినవాల్తేరు మీదుగా ఎంవీపీ కాలనీలోని హాస్టల్‌కు బయలుదేరింది. రాత్రి 12 గంటల సమయంలో చినవాల్తేరు ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ దాటిన తర్వాత బైక్‌పై వెనుక కూర్చున్న శషోతినాగ్ జారి రోడ్డుపై పడిపోయింది. తలకు తీవ్రగాయం కావడంతో ఆమెను వెంటనే రామ్‌నగర్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ రాత్రి 1.30 గంటల సమయంలో మృతిచెందింది. దీనిపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. బంగ్లాదేశ్‌లో ఉంటున్న మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారంతా విశాఖ బయలుదేరారు. మృతురాలి పిన్ని బంగ్లాదేశ్ పోలీస్ శాఖలో డీసీపీగా పనిచేస్తున్నట్టు పోలీసులు చెబుతున్నారు.

యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణకు మరో చాన్స్

- డిసెంబరు 31 వరకూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం
- 150 గజాల వరకు ఉచితంగానే క్రమబద్ధీకరణ
- 150 నుంచి 300 గజాల వరకూ రిజిస్ట్రేషన్ విలువలో 15 శాతం, 300 నుంచి 500 గజాల వరకు 30 శాతం, 500 గజాలు, ఆపైన...అయితే 100 శాతం చెల్లించాలి



సీతంపేటలో యూఎల్‌సీ భూముల్లో నిర్మించిన ఇళ్లు

- 2023 డిసెంబరు నెలాఖరునాటికి వచ్చిన దరఖాస్తులు 687
- తిరస్కరించినవి:150, ప్రభుత్వానికి సిఫారసు చేసినవి : 430

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):

పట్టణ భూగరిష్ఠ పరిమితి (అర్బన్ ల్యాండ్ సీలింగ్) చట్టం కింద స్వాధీనం చేసుకున్న భూముల్లో ఉన్న ఆక్రమణదారులు తమ నిర్మాణాలను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చింది. గత ప్రభుత్వం జీవో నంబరు 84 ప్రకారం 2023 డిసెంబరు 31 వరకూ దరఖాస్తులు స్వీకరించింది. అయితే వాటిపై ఇప్పటివరకూ తుది నిర్ణయం తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత తర్జనభర్జన పడి చివరకు జీవో నంబరు 84 ప్రకారమే దరఖాస్తులు తీసుకోవాలని గత నెల 27న జీవో 27 జారీచేసింది. దాని ప్రకారం ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ వరకు పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టానికి లోబడి మిగులు భూముల ఆక్రమణల క్రమబద్ధీకరణకు

... మిగతా 6వ పేజీలో

నకిలీ బిల్లులతో ఇసుక

- రీచ్‌లలో సిబ్బందితో కొంతమంది వాహన ఆపరేటర్ల కుమ్మక్కు
- గనులు, విజిలెన్స్, రెవెన్యూ అధికారుల తనిఖీలు
- వారంలో ఏడు లారీలు సీజ్



గనుల శాఖ అధికారులు పట్టుకున్న ఇసుక లారీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):

శ్రీకాకుళం జిల్లాలో గల రీచ్‌ల నుంచి కొందరు విశాఖ నగరానికి నకిలీ బిల్లులతో ఇసుక రవాణా చేస్తున్నారు. టన్నుకు కేవలం రెండు వందలు చెల్లిస్తే రీచ్‌లలో కావల్సినంత ఇసుక ఇస్తారు. ఈ మేరకు రీచ్‌ల నిర్వాహకులు బిల్లులను ఇసుక తీసుకువెళ్లే వాహన డ్రైవర్లకు అందజేస్తారు. కానీ కొందరు రవాణా ఆపరేటర్లు, ఇసుక వ్యాపారులు నకిలీ బిల్లులు సృష్టించి శ్రీకాకుళం నుంచి విశాఖకు ఇసుక తీసుకువస్తున్నారు. సాధారణంగా శ్రీకాకుళం జిల్లాలో నాగావళి, వంశధార నదుల్లో రీచ్‌ల నుంచి నగరానికి ఇసుక రవాణా అవుతుంది. రీచ్‌ల నిర్వాహకులే స్వయంగా బిల్లులు రూపొందించి లారీ డ్రైవర్లకు అందజేస్తారు. బయలుదేరిన రీచ్ నుంచి

... మిగతా 6వ పేజీలో

వైభవంగా రథ సప్తమి



రథ సప్తమిని మంగళవారం జిల్లా వాసులు వైభవంగా జరుపుకున్నారు. శ్రీకృష్ణాపురం సమీపంలోని గోశాలలో రథంపై ఉన్న సూర్యుడికి ప్రత్యేక పూజలు చేసి, క్షీరాన్నం నివేదించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ముగ్గురి నామినేషన్

- రెండు సెట్లు దాఖలు చేసిన సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మంగళవారం ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ రెండు సెట్లు, మాజీ ఎంఈవో ఎస్.ఆర్.పద్మావతి, సెయింట్ జోసెఫ్ కళాశాల రిటైర్డు ఆచార్యుడు కోసూరు రాధాకృష్ణ ఒక్కొక్క సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌కు సమర్పించారు. రఘువర్మ వెంట ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఏపీటీఎఫ్ మద్దతుదారులు ఉన్నారు. నామినేషన్ దాఖలకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని సహాయ రిటర్నింగ్ అధికారి బీహెచ్ భవానీశంకర్, నోడల్ అధికారి దయానిధి, ఇతరసిబ్బంది అందించారు. నామినేషన్ పత్రాల దాఖలుకు అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే అనుమతించారు. ఈస్ట్ ఏసీపీ కె.లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు నామినేషన్ సమర్పిస్తున్న పాకలపాటి రఘువర్మ

రఘువర్మకే కూటమి మద్దతు

- ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు

-8లో

పద్మనాభంలో 83 మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు

పద్మనాభం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పద్మనాభం మండలంలో 83 మంది ఓటర్లు నమోదయ్యారు. ఇటీవల ఓటర్ల నమోదులో రెండు దరఖాస్తులు చేరడంతో ఎన్నికల నాటికి వాటికి కూడా ఆమోదం లభిస్తే మొత్తం 85 మంది ఓటర్లు ఉంటారు. గత ఎన్నికలలో 79 మంది ఓటర్లుగా ఉన్నారు. కాగా పద్మనాభంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పోలింగ్ కేంద్రంగా గుర్తించారు. ఈ ఎన్నికకు సంబంధించి ఇప్పటికే ఉపాధ్యాయులు తమ అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తున్నారు.

కానోయ్‌స్లాలమ్ పోటీలో చేతన భగవతికి కాంస్య పతకం



కాంస్య పతకం సాధించిన భగవతి

సాగర్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాఖండ్‌లో జరిగిన 38వజాతీయ క్రీడల్లో కానోయ్‌స్లాలమ్ సి1 మహిళల విభాగంలో దొడ్డి చేతన భగవతి కాంస్య పతకం చేజిక్కించుకుంది. ఈ విషయాన్ని కానోయింగ్ అండ్ కయాకింగ్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ప్రెసిడెంట్ బి.బలరామనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. చేతన విజయం ఏపీకీ గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా కోచ్ శ్రీతేజను అభినందించారు.

ఘనంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సుప్రభాత ఆరాధనలు తర్వాత ఆలయ రాతి రథం మీదనే ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ఉంచి ముఖ్య అర్చకులు నరసింహాచార్యులు భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణాన్ని జరిపారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

సేంద్రీయ ఎరువులతో అధిక దిగుబడులు

» జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి



వరి పొలాలను పరిశీలిస్తున్న డీఏవో అప్పలస్వామి, వ్యవసాయ శాఖ అధికారులు

ఆనందపురం, ఫిబ్రవరి 4: సేంద్రీయఎరువులతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వెల్లంకి, పెద్దిపాలెం పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువులకు దూరంగా ఉండాలని సూచించారు. సేంద్రీయ ఎరువులతో పండించిన పంటలకు దిగుబడి, మార్కెట్లో డిమాండ్ అధికంగా ఉంటుందన్నారు. వరిపంట నారు మడులను సందర్శించారు. నాటు కోసం ప్రధాన పొలాన్ని సిద్ధం చేసుకునేటప్పుడు వరి నారు వయస్సు 25 నుంచి 30 రోజులు మించకుండా చూసుకోవాలన్నారు. నాటు వేసే ముందు రెండు నుంచి మూడుసార్లు వారం రోజుల వ్యవధిలో పొలాన్ని దమ్ము చేయాలన్నారు. చివరి దమ్ములో ఎకరానికి ఒక్క బస్తా డీఏపీ, యూరియ పది కిలోలు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ పది కిలోల చొప్పున వేసి నాటు వేయాలన్నారు. కార్యక్రమంలో విస్తరణాధికారులు బి.స్వాతి, జి.రమేష్ పాల్గొన్నారు.

మినప పంటకు తెగుళ్ల బెడద

పద్మనాభం రూరల్ : ప్రస్తుత సీజన్‌లో అపర పంటల సాగుపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి ఎంవీ చలం సూచించారు. మంగళవారం తునివలస, నరసాపురం, నేరేళ్లవలస గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరసాపురంలో మినప, ఉలవ పంటలను పరిశీలించారు. మినప పంటకు ఆకు పసుపుగా మారి గిడసబారి ఉండడంతో పల్లాకు తెగులుగా గుర్తించారు. ఇది వైరస్ ద్వారా వ్యాప్తి చెందుతుందని, పంటకు అలాంటి లక్షణాలు కనిపించినప్పుడు ఆకులను తొలగించాలని సూచించారు. అలాగే మినపకు ఆకుపచ్చ తెగులు సోకితే ఎకరాకు మేంకోజెబ్ 250 గ్రాములు, కార్బెండిజమ్ 250 గ్రాములు పిచికారి చల్లాలని చెప్పారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ ఎం.తేజ, అయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో భీమిలి పాలిటెక్నిక్ కళాశాలకు

ఓవరాల్ ఛాంపియన్ షిప్



విజేతలతో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది

భీమునిపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు మహిళా విభాగంలో ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 28 నుంచి జరిగిన స్టేట్ లెవల్ ఇంటర్ స్టేట్ పాలిటెక్నిక్ కాలేజీల స్పోర్ట్స్, గేమ్స్ ఛాంపియన్‌లో తమ కళాశాల నుంచి 17 మంది విద్యార్థినులు పాల్గొన్నట్టు చెప్పారు. వీటిలో ఖో-ఖో, బాడ్మింటన్, చెస్‌లలో ప్రథమ స్థానం, షార్టుపుట్‌లో తృతీయ స్థానం, 800 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానాలు గెలుచుకున్నట్టు తెలిపారు. రాష్ట్ర స్థాయి ఓవరాల్ ఛాంపియన్ షిప్, గేమ్స్ ఓవరాల్ ఛాంపియన్ షిప్ ఫర్ గర్ల్స్‌ను కైవసం చేసుకున్నారన్నారు. జాతీయ స్థాయి పోటీలలో కూడా అత్యంత నైపుణ్యతను ప్రదర్శించి ఉత్తమ క్రీడాకారులుగా నిలవాలని ఆకాంక్షించారు.

శ్రీవారికి మేల్చాట్ వస్త్ర అలంకరణకు అవకాశం

సాగర్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ సంప్రదాయం ప్రకా రం ప్రతి శుక్రవారం శ్రీవారికి మేల్చాట్ వస్త్రాన్ని (పట్టు వస్త్రం) ధరింప చేస్తారు. ఈ వస్త్రాన్ని తిరుమలలో శ్రీవారికి అందించాలన్నది ఎందరో భక్తుల ఆకాంక్ష. అటువంటి అవకాశాన్ని భక్తులకు అందిస్తున్నట్టు రుషి కొండ టీటీడీ ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల ఆకాంక్ష మేరకు రుషికొండ ఆలయంలో శ్రీవారికి మేల్చాట్ వస్త్రాన్ని ఒకరు స్వయంగా అందించే సువర్ణ అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. ఈ వస్త్రం రూ. 30 వేలు నుంచి రూ. 80 వేలు వరకు ఉంటుందని, భక్తుల అభీష్టం మేరకు వస్త్రాన్ని అందించవచ్చన్నారు. వస్త్రాన్ని అందించే భక్తులతో స్వామివారికి అభిషేకం నిర్వహించనున్నట్టు తెలిపారు. వివరాల కోసం ఫోన్ : 9866397598, 807440845 ఫోన్ నంబర్లను సంప్రతించాలని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని ఏఈవో కోరారు.

సకాలంలో గుర్తిస్తే క్యాన్సర్ నుంచి బయటపడవచ్చు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది

భీమునిపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ బారి నుంచి ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఫణికుమార్ అన్నారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినాన్ని ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్ నివారణకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆహారపు అలవాట్లు, జీవనశైలిని మార్చుకుంటే క్యాన్సర్ కు రాకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. అనంతరం పట్టణలో కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సాగర్‌నగర్ : జీవన విధానంలో వస్తున్న మార్పులే కేన్సర్ వ్యాధికి ప్రధాన కారణమని పలువురు అంకాలజిస్టులు పేర్కొన్నారు. మంగళవారం కేన్సర్ దినం సందర్భంగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ జీవశాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ బి.రవిశంకర్, డాక్టర్ ఎస్.రఘువంశీ, డాక్టర్ బాలస్టాలిన్ చౌదరి పలు సూచనలు అందించారు. విద్యారులకు పోటీలు నిర్వహించి బహుమతులు అంజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కేవీస్ కృష్ణ, కన్వీనర్ ప్రొఫెసర్ ఎం.రామారావు పాల్గొన్నారు.



భీమిలిలో సూర్య భగవానుడిగా కల్యాణ వేంకటేశ్వరస్వామి

ఓం నమో ఆదిత్యాయ నమః

పలు ఆలయాల్లో వైభవంగా రథసప్తమి వేడుకలు

భీమునిపట్నం ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సూర్య భగవానుడు జయంతి (రథసప్తమి)ని మంగళవారం పలు ఆలయాల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక కృష్ణాకాలనీ వెంకటగిరిపై ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి పురస్కరించుకుని శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామిని సూర్య భగవానుడిగా సప్తాశ్వరథ వాహనంపై అధిష్ఠింపజేసి పూజలు జరిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

పద్మనాభం: అనంత పద్మనాభుని క్షేత్రంలో రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుంతీ మాధవ స్వామి ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద భక్తులు ఆదిత్యునికి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు మహిళలు పరమాన్నం వండి ఆదిత్యునికి నివేదించారు. అర్చకులు పి.సీతారామాంజనేయస్వామి, పి.వెంకటాచారి ఆధ్వర్యంలో పూజల్లో ఎంపీపీ కె.రాంబాబు, మాజీ ఎంపీపీ కె.పద్మ, టీడీపీ మండల అధ్యక్షుడు కె.నగేశ్‌కుమార్, సర్పంచ్ టి.పాప, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీను, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గోశాలలోని ఆదిత్యుని ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే 'గంటా'

సింహాచలం: సింహాచల దేవస్థానం ఆధీనంలో కృష్ణాపురం గోశాలలో ఉన్న సూర్యనారాయణస్వామి దేవాలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. రథసప్తమిని పురస్కరించుకుని మంగళవారం 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహంతో కలిసి సూర్యదేవున్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019లో సూర్యనారాయణస్వామి విగ్రహ ప్రతిష్ఠ తన చేతులమీదుగానే జరిగిందన్నారు. ప్రతి ఆదివారం వందలాది మంది భక్తులు ఇక్కడకు ఆదిత్యుని దర్శనార్థం వస్తున్నందున ఆలయ పరిసరాలు రద్దీగా మారుతున్నాయన్నారు. అందువల్ల భక్తులకు కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత దేవస్థానం అధికారులపై ఉందని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాగా గంటాకు ఏఈవో ఎన్.ఆనందకుమార్, పర్యవేక్షణాధికారి పద్మనాభరాజు (విక్రమ్) ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ఆయన గోత్రనామాలతో పూజలు జరిపి శేషవస్త్రాన్ని, వేదాశీర్వచనాలను అందజేశారు. గంటా వెంట టీడీపీ 98వ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, నాయకులు ఎస్.సురేశ్, అవినాశ్ బాబు, పి.మురళీ, తదితరులు ఉన్నారు.



గోశాలలోని ఆదిత్యునికి పూజలు చేస్తున్న గంటా శ్రీనివాసరావు

'వేలం రద్దు చేయకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేస్తాం'

సింహాచలం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి భక్తులను అధికారికంగా కల్యాణమండపాల పేరుతో మోసం చేస్తున్న వేలాన్ని రద్దు చేయకుంటే ఆమరణ నిరాహార దీక్షకైనా తాము సిద్ధమే నని హిందూ సంఘాల జేఏసీ కన్వీనర్ పూడిపెద్ది శర్మ అన్నారు. సింహగిరిపై కల్యాణ మండపాల వేలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కొండదిగువ ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు మంగళవారం కూడా కొనసాగాయి. సాధారణ భక్తులు తమ పిల్లల పెళ్ళిళ్లు అప్పన్న సన్నిధిలో చేసుకోవాలంటే కల్యాణ మండపాల వేలం వల్ల మోయలేనంత భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల దేవదాయశాఖ ఉన్నతాధికారులు వేలం రద్దుకు తగిన చర్యలు చేపట్టాలని శర్మ కోరారు.

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ అందజేత

కొమ్మాది, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వ్యాపార దృక్పథంతో కాకుండా సామాజిక సేవలు కూడా తాము చేపడుతున్నామని ఐడీబీఐ విశాఖపట్నం డివిజినల్ మేనేజర్ కె.దాస్ అన్నారు. మంగళవారం చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం గొట్టేటి రవి మాట్లాడుతూ తమ పాఠశాలకు ఐడీబీఐ ప్రతినిధులు సౌండ్ సిస్టమ్‌ను అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

రోడ్డుకు అడ్డంగా ఫెన్సింగ్ వేయడాన్ని నిరసిస్తూ ఆందోళన



ఫెన్సింగ్ వేసిన ప్రాంతంలో నిరసన తెలుపుతున్న సంగివలస గ్రామస్తులు

తగరపువలస, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సంగివలసలో దుర్గాలమ్మ ఆలయానికి వెళ్లే రహదారికి అడ్డంగా కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా ఐరన్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ పలువురు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు చోడిపల్లి గంగాధరరావు, సీహెచ్ నాగరాజు, ఎన్.సూరిబాబు, సీహెచ్ సూరి, కోనాడ శ్రీను, రాములమ్మ, త్రినాథరావు, భార్గవ్, తదితరులు విలేకరులతో మాట్లాడారు. సంగివలస సర్వే నంబర్లు 25/6, 23/9లో అర కిలోమీటరు పొడవునా ఉన్న రోడ్డును ఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు వినియోగించుకుంటున్నారు. 1959లో ఏపీ గజిట్‌లో సంగివలస విలేజ్ మ్యాప్‌లో ఈ రహదారి బండి బాటగా నమోదైందన్నారు. 1960లో తయారుచేసిన ఒరిజినల్ ఎఫ్ఎంబీలో రోడ్డుగా నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

అయితే సంబంధిత సర్వే నంబర్లలోని అడంగల్‌లో కొంతమంది ప్రైవేటు వ్యక్తుల పేర్లను పట్టాదారులుగా నమోదు చేశారని వారు ఆరోపించారు. ఈ మేరకు రాత్రికి రాత్రి ఫెన్సింగ్ వేయడం శోచనీయమన్నారు. దీనిపై ఇటీవల కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశామని, అయినా అధికారులు పట్టించుకోకపోవడం లేదన్నారు. రోడ్డుకు అడ్డంగా ఫెన్సింగ్ వేయడం వల్ల తాము ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొన్నారు. కాగా సంబంధిత ప్రదేశాన్ని మండల ఆర్ఐ మల్లేశ్వరరావు సందర్శించి, ఇరు వర్గాలను తమ వద్దనున్న రికార్డులతో తహసీల్దార్ కార్యాలయానికి హాజరు కావాలని సూచించారు. తమకు న్యాయం జరిగేంత వరకు పోరాడతామని గ్రామస్తులు తెలిపారు.

ఉద్యోగం నుంచి తొలగించారని దురాగతం!

» కేజీహెచ్‌లో పిల్లల వార్డుకు ఆక్సిజన్ అందించే పైప్ కోసేందుకు యత్నం » రౌడీషీటర్ సహా నిందితుల అరెస్టు

మహారాణిపేట (విశాఖపట్నం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తనను ఉద్యోగం నుంచి తొలగించారనే కోపంతో కేజీహెచ్ పిల్లల వార్డుకు ఆక్సిజన్ అందించే పైపును కత్తిరించేందుకు యత్నించిన రౌడీషీటర్, అతనికి సహకరించిన మరో ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సీఐ జె.దేముడుబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం...ఏవీఎన్ కాలేజీ డౌన్స్ ప్రాంతంలో నివాసం ఉంటున్న రాజు కేజీహెచ్‌లో పనిచేసేవాడు. పిల్లలపై అత్యాచారయత్నానికి పాల్పడడం, మద్యం తాగి ఆసుపత్రిలో విధులకు హాజరుకావడం, అనేక నేరారోపణలు రావడంతో అతడిని విధుల నుంచి తొలగించారు. రాజుపై పోలీసులు రౌడీ షీట్ కూడా తెరిచారు. ఈ క్రమంలో వైద్యులపై కోపం పెంచుకున్న రాజు కేజీహెచ్‌లోని పిల్లల వార్డుకు ఆక్సిజన్ సరఫరా చేసే పైపులను ఈ నెల ఒకటో తేదీ మధ్యాహ్నం కత్తిరించేందుకు యత్నించాడు. అది గమనించిన సెక్యూరిటీ గార్డులు అడ్డుకునేందుకు యత్నించగా, వారిని కత్తితో బెదిరించి అక్కడ నుంచి పరారయ్యాడు. పిల్లలకు ప్రాణవాయువు (ఆక్సిజన్) అందకుండా చేసి, వారి ప్రాణాలు తీయాలనే దురుద్దేశంతో మరో ఇద్దరి సహాయంతో రాజు ఈ దురాగతానికి తెగబడ్డాడు. ఈ సమాచారం అందుకున్న సీఐ ఆధ్వర్యంలోని పోలీసు బృందం హుటాహుటిన కేజీహెచ్‌కు వెళ్లి సీసీ పుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. వైద్యాధికారుల ఫిర్యాదు మేరకు రాజును, అతనికి సహకరించిన మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ వివరించారు. రాజుపై గతంలో పలు కేసులు ఉన్నట్టు తెలిపారు.

మహా దుబారా

... 5వ పేజీ తరువాయి

వీలుగా 'ఐ లవ్ వైజాగ్' బోర్డు ఏర్పాటుచేయగా, అది మూన్నాళ్లకే విరిగిపోవడంతో తిరిగి జీవీఎంసీ అధికారులే నిధులు వెచ్చించి కొత్త బోర్డు పెట్టించారు.

కనిపించని బయో రెమిడేషన్

నగరంలోని మురుగునీరు సముద్రంలో కలు స్తుంటుంది. జీ-20 సదస్సుకు వచ్చే ప్రతినిధులు బీచ్‌రోడ్డులో ప్రయాణించినప్పుడు అది చూస్తే నగరంపై ప్రతికూల భావన కలుగుతుందని అధికారులు అనుకున్నారు. అందుకే సాగర్‌నగర్ వద్ద బీచ్‌రోడ్డు కింద నుంచి ప్రవహించే మురుగు నీటి కాలువపై తేలియాడే మొక్కలను పెంచుతామంటూ 'బయో రెమిడేషన్' పేరుతో భారీగా నిధులు ఖర్చుపెట్టారు. పీవీసీ పైపులను కట్ చేసి వాటిల్లో ప్రత్యేకంగా దిగుమతి చేసుకున్న మొక్కలను నాటారు. మురుగునీటి కాలువ బయటకు కనిపించకుండా పైపుల్లో నాటిన మొక్కలు మాత్రమే తేలియాడేలా చేశారు. మొక్కలు మురుగునీటికాలువలోని హానికరమైన వ్యర్థాలతో కూడిన నీటిని తీసుకుంటాయి కాబట్టి, సుందరీకరణతోపాటు సముద్ర జలాల కాలుష్యానికి కూడా చెక్ పెట్టవచ్చునంటూ అధికారులు అప్పట్లో చెప్పుకొచ్చారు. తర్వాత వీటి నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఇప్పుడు అక్కడ మొక్కలు మాత్రమేకాదు...పైపులు కూడా మచ్చుకైనా కనిపించడం లేదు.

వ్యూపాయింట్ వద్ద పాడైపోయిన నడకదారి

సీతకొండ వ్యూపాయింట్ వద్ద సందర్శకులు నడిచేందుకు వీలుగా సముద్ర తీరం వైపు ప్రత్యేకంగా రాళ్ల పలకలతో నడకదారి నిర్మించారు. నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో రాతి పలకలన్నీ పైకి లేచిపోయి చిందరవందరగా పడి ఉన్నాయి. ఆ మార్గంలో నడిచేవారు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా సరే వాటిని తన్నుకుని కిందపడిపోయే ప్రమాదం ఉంది. అక్కడకు సమీపంలో తారురోడ్డు కూడా పాడైపోవడం పనుల్లో నాణ్యతాలోపాన్ని తెలియజేస్తోంది.

దిగొచ్చిన కూరగాయల ధరలు

... 5వ పేజీ తరువాయి

రూ.22కి లభిస్తున్నాయి. గ్రీన్ పీస్ (బఠాణీలు) జనవరి మొదటి వారంలో కిలో రూ.100 పైనే విక్రయించారు. ఇప్పుడు కిలో రూ.40కే అమ్ముతున్నారు. బీరకాయలు, బెండకాయల ధర మాత్రం తగ్గలేదు. ప్రస్తుతం బీర కిలో రూ.50, బెండకాయలు కిలో రూ.40 చొప్పున విక్రయిస్తున్నారు. ఇవి మార్కెట్‌కు తక్కువ మోతాదులో రావడంతో మంచి రేటు పలుకుతున్నదని రైతులు చెబుతున్నారు. అల్లం కిలో రూ.100 వరకు ధర పలకగా ఇప్పుడు కొత్తది రావడంతో రూ.44కే ఇస్తున్నారు.

నగరంలో ఎక్కువ మంది కూరగాయలు కొనడానికి రైతుబజార్లకే వస్తారు. అయితే ధరలు బాగా తగ్గడంతో రోజువారీ వ్యాపారాలు చేసేవారు టమాటా, ఉల్లి వంటి సరకులు హోల్‌సేల్‌గా కొని ఆటోల్లో వేసుకొని వీధివీధికీ తిరిగి అమ్ముతున్నారు. దాంతో చాలామంది వారి వద్దే కొనుక్కుంటున్నారు. దీంతో రైతుబజార్లపై ఒత్తిడి తగ్గింది. స్టాళ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

నకిలీ బిల్లులతో ఇసుక

... 5వ పేజీ తరువాయి

నగరంలో ఎక్కడకు ఇసుక రవాణా చేస్తుంటారో ఆ వివరాలన్నీ బిల్లులో ఉంటాయి. రీచ్ నుంచి విశాఖపట్నం వరకు మధ్యలో గనుల శాఖ, పోలీసులు, రెవెన్యూ అధికారులు తనిఖీ చేసినప్పుడు బిల్లులు చూపించాలి. అయితే కొద్దిరోజులుగా శ్రీకాకుళం జిల్లా నుంచి విశాఖ నగరానికి నకిలీ బిల్లులతో కొందరు లారీ యజమానులు/డ్రైవర్లు ఇసుక తీసుకువస్తున్నారు. రీచ్‌లలో పనిచేసే కొందరు సిబ్బందితో కుమ్మక్కై టన్నుకు అధికారికంగా రూ.200 చెల్లించకుండా ఇసుక లోడ్ చేసుకుంటున్నారు. ఉదాహరణకు 30 టన్నుల లోడ్‌కు రీచ్ నిర్వాహకులకు రూ.ఆరు వేలు చెల్లించాలి. అయితే రీచ్‌లో కొందరు సిబ్బంది 30 టన్నుల లోడ్‌కు రూ.మూడు వేల మాత్రమే తీసుకుని నకిలీ బిల్లులు ఇస్తున్నారు. ఇంకా రీచ్‌లకు ఆనుకుని గ్రామాల్లో కొందరు వ్యక్తులు తమ పొలాలు/తోటల్లో నిల్వ చేసిన ఇసుకను విక్రయిస్తున్నారు. వారు బిల్లులు ఇవ్వరు. అటువంటప్పుడు రీచ్‌లలో పనిచేసే కొందరు సిబ్బందితో మాట్లాడి నకిలీ బిల్లులు తీసుకుంటున్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో గడచిన వారం రోజుల్లో గనుల శాఖలో రెగ్యులర్, విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించి నకిలీ బిల్లులతో ఉన్న ఏడు లారీలను సీజ్ చేశారు. భారీగా జరిమానా విధించారు. అలాగే ఒకే బిల్లుపై రెండు, మూడు రోజులపాటు ఇసుక రవాణా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గనుల శాఖ, విజిలెన్స్ అధికారులు మరింత నిఘా పెంచాలని నిర్ణయించారు.

యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణకు మరో చాన్స్

... 5వ పేజీ తరువాయి

దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్, పట్టణ భూగరిష్ఠ పరిమితి కాంపిటెంట్ అధికారి కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ జీవో మేరకు 2019 మే ఒకటో తేదీ నాటికి సదరు మిగులు భూమిలో ఉన్నట్టు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఇంటి నిర్మాణం కోసం జీవీఎంసీ నుంచి తీసుకున్న ప్లాన్, కరెంట్ బిల్లు, ఇంటి, నీటి పన్ను రశీదు నకళ్లతో డిసెంబరు 31వ తేదీలోగా క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు సంబంధిత తహసీల్దార్ లేదా కలెక్టరేట్‌లోని యూఎల్‌సీ విభాగంలో అందజేయాలని కోరారు. 150 గజాల వరకు ఉచితంగా క్రమద్ధీకరించి పట్టా ఇస్తారు. 150 నుంచి 300 గజాల వరకు ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువలో 15 శాతం, 300 నుంచి 500 గజాల వరకు 30 శాతం, 500 గజాలు, ఆపైన...అయితే 100 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఆ మొత్తం లెక్కించి సగం సొమ్మును 'జాయింట్ కలెక్టర్ అండ్ కాంపిటెంట్ అథారిటీ, అర్బన్ ల్యాండ్ సీలింగ్, విశాఖపట్నం' పేరిట డీడీ తీసి దరఖాస్తుకు జత చేసి అందజేయాలన్నారు. సందేహాలు, ఇతర వివరాలకు సంబంధిత తహసీల్దారు కార్యాలయంలో సంప్రతించాలని కోరారు.

నగరంలో సీతమ్మధార, గోపాలపట్నం, మహారాణిపేట, గాజువాక, ములగాడ, పెదగంట్యాడ, పెందుర్తి, విశాఖ రూరల్ తహసీల్దార్ కార్యాలయాల పరిధిలో 266 హెక్టార్ల యూఎల్‌సీ భూములు ఉన్నట్టు అధికారులు గతంలో నిర్ధారించారు. వాటిలో 86 హెక్టార్లలో ఆక్రమణలు ఉన్నట్టు గుర్తించారు. మరో 100 హెక్టార్ల భూమిని ఇంకా గుర్తించాల్సి ఉండగా, 80 హెక్టార్లలో రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, సామాజిక భవనాలు ఉన్నాయని చెబుతున్నారు. ఆ 86 హెక్టార్లలో సుమారు 3,025 ఆక్రమణలు ఉన్నట్టు అప్పట్లో గుర్తించి 2023 మార్చి తరువాత 1,583 మందికి నోటీసులు ఇచ్చారు.

మిగిలిన వారికి నోటీసులు ఇస్తే అప్పట్లో చాలామంది తీసుకోలేదు. 2023 డిసెంబరు 31తో గడువు ముగిసేనాటికి 687 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 150 గజాల కంటే తక్కువ విస్తీర్ణం ఉన్న ఆక్రమణదారులు 643 మంది, 150 గజాల పైబడి విస్తీర్ణం ఉన్నవారు 44 మంది ఉన్నారు. పలు కారణాలతో 150 దరఖాస్తులు తిరస్కరించగా, 150 గజాల కంటే తక్కువ విస్తీర్ణం ఉన్నవి 386, అంతకు మించినవి 44 వెరసి 430 దరఖాస్తులు పరిశీలించి క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వానికి పంపారు. 150 గజాల విస్తీర్ణం పైబడి ఆక్రమణదారులు రూ.3.52 కోట్లు చెల్లించారు. అయితే ప్రభుత్వానికి దరఖాస్తులు పంపినా ఒక్కటి కూడా క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు ఇవ్వలేదు. దరఖాస్తుదారులు కలెక్టరేట్‌కు వచ్చి విచారిస్తూనే ఉన్నారు. చివరకు గత నెలలో జరిగిన క్యాబినెట్‌లో యూఎల్‌సీ ఆక్రమణలపై చర్చించిన మీదట గత నెల 27న జీవో ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవోను యథాతథంగా అమలు చేస్తూ కేవలం దరఖాస్తుల సమర్పణకు డిసెంబరు 31వ తేదీ వరకూ గడువు మాత్రమే పెంచారు.

టీడీఆర్‌ల జారీలో ఆరోపణలపై కలెక్టర్ ఆరా

నివేదిక ఇవ్వాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశం

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో టీడీఆర్‌ల జారీలో అక్రమాలు జరిగాయంటూ వెల్లువెత్తుతున్న ఆరోపణలపై జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హోదాలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆరా తీసినట్టు తెలిసింది. పత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందించిన ఆయన ఆరోపణలకు సంబంధించిన టీడీఆర్‌ల ఫైళ్లు తీసుకురావడంతోపాటు ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణతో కూడిన నివేదిక ఇవ్వాలని చీఫ్‌సిటీప్లానర్ ప్రభాకరరావును ఆదేశించినట్టు సమాచారం. మంగళవారం సాయంత్రం చీఫ్‌సిటీప్లానర్ ప్రభాకరరావు కలెక్టర్‌ను కలవడంతో టీడీఆర్‌లపై ఆరోపణలకు సంబంధించిన వివరణ ఇచ్చేందుకే వెళ్లారని ఆ విభాగం అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఆయా ఫైళ్లను పరిశీలించి కలెక్టర్ ఒక నివేదికను రాష్ట్రప్రభుత్వానికి పంపించే అవకాశం ఉందని చెబుతున్నారు.

కొనసాగుతున్న సంపూర్ణ రామాయణ ప్రవచనాలు

కొమ్మాది, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోని నగరాలకు, నదులకు, పర్వతాలకు అధిష్టాన దేవతలు ఉంటారని, వారు తప్పక అనుగ్రహిస్తారన్న విషయాన్ని రామాయణం చెబుతుందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు తెలిపారు. కొమ్మాది గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణ ప్రవచనాల్లో భాగంగా మంగళవారం అరణ్యకాండలో శ్రీరాముడు అరణ్యవాసానికి బయలుదేరే సమయంలో చోటుచేసుకున్న ఘటనను వివరించారు. భరద్వాజ మహర్షి శ్రీరామున్ని చిత్రకూట పర్వతం వద్ద నివాసం ఉండమని చెబుతూ ఆపర్వత శిఖర దర్శనం వల్ల పాపం చేయాలన్న ఆలోచన కూడా రాదని చెప్పడం దేశంలోని పర్వతాల గొప్పతనాన్ని తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ అన్నపూర్ణ మృతి



అన్నపూర్ణ (ఫైల్ ఫొటో)

తగరపువలస, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): భీమిలి మునిసిపల్ మాజీ కౌన్సిలర్ చేట్ల అన్నపూర్ణ (73) సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. 1987-92లో ఆమె ఆరో వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్‌గా సేవలందించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆమె ఎంతో కృషి చేశారు. అన్నపూర్ణ మృతి పట్ల మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ గిడుతూరి కల్యాణి, పలువురు మాజీ కౌన్సిలర్లు సంతాపం వ్యక్తం చేశారు.



ఆరిలోవ : గోశాలలో సూర్యభగవానుడికి పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో రథసప్తమి పూజలు

ఆరిలోవ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రథసప్తమిని పురస్కరించుకొని జీవీఎంసీ 13వ వార్డులోని శ్రీకృష్ణాపురంలో గల గోశాల వద్ద సూర్యనారాయణ స్వామి విగ్రహం వద్ద మంగళవారం ఉదయం అధిక సంఖ్యల భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల తాడికి ఎక్కువగా ఉండడం, సింహాచలం దేవస్థానం అధికారులు ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఇబ్బంది తలెత్తింది. కార్యక్రమంలోసింహాచలం దేవస్థానం ఏఈవో ఆనంద కుమార్, ఈఈ రాంబాబు, డీఈ శ్రీహరి, టీడీపీ 13వ వార్డు అధ్యక్షుడు ధర్మారావు, కార్యదర్శి యల్లమిల్లి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



వెంకోజీపాలెం : వైభవ వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

తోటగరువు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు సూర్యనమస్కారాలు, యోగాసనాలు వేశారు. పాఠశాల హెచ్ఎం వి.విశ్వనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సుబ్రహ్మణ్యశాస్త్రి, బాల భాస్కరశర్మ భక్తులకు పూజాధికార్యక్రమాలు చేపట్టారు.కొత్త వెంకోజీపాలెంలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీచక్రం వేసి అర్చకులు కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు చేశారు. హెచ్‌బీ కాలనీ శివాలయంలోని వేంచేసి ఉన్న సూర్యనారాయణ స్వామి ఆలయంలోతెల్లవారు జామునుంచి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం సూర్యనారాయణ స్వామికి కల్యాణం జరిపారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులచే శ్రీస్వామివారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, భక్తుల గోత్రనామాలతో అర్చకులు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా బడ్డీల తొలగింపు

- స్టీల్‌ప్లాంటు, జీవీఎంసీ సిబ్బంది హడావుడి
- విద్యుత్ శాఖ నుంచి సహకారం అందకపోవడంతో ఇబ్బందికర పరిస్థితి



ఖాళీగా ఉన్న బడ్డీలను తొలగిస్తున్న స్టీల్‌ప్లాంట్ సిబ్బంది



దుకాణదారులతో మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ ఎస్టేట్ అధికారి జగన్నాథరావు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ నుంచి సులబ్ కాంప్లెక్సు సమీపంలో ఉన్న బడ్డీలను జీవీఎంసీ సిబ్బందితో కలిసి స్టీల్‌ప్లాంటు స్టాఫ్ తొలగించారు. 'ప్రభుత్వం మారినా.. ఆక్రమణలు తొలగలేదు' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన స్టీల్‌ప్లాంట్ అధికారులు బడ్డీల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. అయితే ఆక్రమణ బడ్డీలను మాత్రం 'తూతూమంత్రం' అన్నట్టుగా తొలగించారు.

హెచ్‌బీ కాలనీ సులబ్ కాంప్లెక్సు వద్ద పదుల సంఖ్యలో ఆక్రమణ బడ్డీలు ఉంటే కేవలం వ్యాపారం సాగించకుండా ఖాళీగా ఉన్న రెండు మూడు బడ్డీలను మాత్రమే క్రేన్‌లు, సిబ్బందితో వచ్చి హడావుడి సృష్టించి తొలగించి చేతులు దులుపుకున్నారు. 'ఇదేమిటని..' కొందరు ప్రశ్నించగా.. విద్యుత్ శాఖ సహకారం లేదని, బడ్డీలకు విద్యుత్ సరఫరా నిలిపివేయమని తాము 4 నెలల క్రితమే లేఖను సమర్పించిన విద్యుత్ శాఖ వారు మాత్రం ఎటువంటి స్పందన లేదని స్టీల్‌ప్లాంట్ ఎస్టేట్ అధికారి జగన్నాథరావు చెప్పారు. బడ్డీలు జీవీఎంసీకి చెందిన రోడ్డుపై ఉన్నాయని, వాటిని తొలగించమని జీవీఎంసీ తరుపున తమకు లేఖను ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారని ఆయన తెలిపారు. విద్యుత్ శాఖ సహకారం లేకపోతే తాము బడ్డీలను తొలగించడం సాధ్యం కాదని చెప్పుకొచ్చారు. విద్యుత్ శాఖ, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు సహకరిస్తేనే ఆక్రమణ బడ్డీలను తొలగించడం సాధ్యపడుతుందని ఎస్టేల్ అధికారి తెలిపారు.

బడ్డీల కారణంగా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందని, అంతేకాకుండా అక్రమంగా బడ్డీలను ఏర్పాటు చేసి అద్దెలతో పాటు దందాలను కూడా వైసీపీ నేతలు నిర్వహిస్తున్నారని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతో కేవలం స్టీల్‌ప్లాంట్ సిబ్బందిలో మాత్రమే కదలిక వచ్చింది. మిగిలిన జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్, విద్యుత్ శాఖలో మాత్రం ఎటువంటి చలనం కలుగకపోవడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారాలు సాగిస్తున్న బడ్డీలకు జీవీఎంసీ వారు పన్నులు విధించడం, విద్యుత్ శాఖ వారు మీటర్లు ఇస్తుంటే ఆక్రమణలకు అడ్డుకట్ట ఎక్కడ వేస్తున్నట్టని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ ఆక్రమణలకు అడ్డుకట్ట వేసి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

తడి నేలలు పర్యావరణ హితం



సదస్సులో పాల్గొన్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : తడినేలలు పర్యావరణానికి హితమని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు చెప్పారు. కళాశాలలో మంగళవారం ప్రపంచ చిత్తడి నేల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు తడినేలలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తడినేలలు నీటిని అందించడమే కాకుండా పర్యావరణ ఆరోగ్యాన్ని అందిస్తాయన్నారు. సుస్థిరమైన పట్టణ భవిష్యత్‌కు తడి భూములు దోహదపడతాయన్నారు. అం దుకే తడినేలలు పరిరక్షించుకోవడానికి ఒప్పందం కుదిరిన ఫిబ్రవరి 2న ప్రపంచ తడి నేల దినోత్సవం జరుపుతారని, ఆ ఏడాది మొత్తం ఇక థీమ్‌తో చిత్తడి నేలలపై అవగాహన కల్పిస్తారన్నారు. భూమి, నీరు కలిసే ప్రాంతాన్నే చిత్తడి నేల అంటారని, ఇదీ కొద్ది నెలలు, సంవత్సరం కలిసి వుండడం వలన అక్కడ ఎన్నో జీవరాశులు జీవించడమేకాకుండా పర్యావరణానికి మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పద్మావతి, పుష్పలత, సుజాత, రామలక్ష్మణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కనకమ్మవారి పరస

మద్దిలపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చైతన్యనగర్‌లో కొలువైయున్న కనకమ్మవారి పరస మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం చైతన్యనగర్‌లో జాతర ఏర్పాటు చేసి తినుబండరాళ్లు, బొమ్మల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఏయూను సందర్శించిన ఎస్టీ కమిషన్ సభ్యుడు



ఏయూ అధికారులతో ఎస్టీ కమిషన్ సభ్యుడు

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులతో ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వి.సోమశంకర్‌నాయక్ మంగళవారం భేటీ అయ్యారు. వర్సిటీలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారి సమస్యలు పరిష్కరించే చర్యలు చేపట్టాలన్నారు. వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్ ప్రొఫెసర్ బసవయ్య, ప్రొఫెసర్ జర్రా అప్పారావు,ప్రొఫెసర్ అరుణ్‌కుమార్, ప్రొఫెసర్ పడాల్, కుంజం నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు ఆర్థిక సహాయం

మద్దిలపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రోటరీ క్లబ్ విశాఖ ఆధ్వర్యంలో అంధ విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హెల్ప్ ద బ్లైండ్ ఫౌండేషన్ నిర్వాహకుడు శివాజీరావు మాట్లాడుతూ ఇలాంటి విద్యార్థులకు సహాయం అందజేస్తే చదువుకోగలుగుతారన్నారు. ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సేవా తత్వంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు పి.ధనలక్ష్మి, కె.రవిబాబు, ఎం.రాజేశ్వరరావు, పోలా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

యువకుడి మృతి కేసులో ఐదుగురి అరెస్టు

గాజువాక, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గాజువాకలోని శ్రీనగర్ ప్రాంతంలో ఈ నెల ఒకటో తేదీన అనుమానాస్పదంగా మృతి చెందిన జి.భాస్కరరావు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులు మంగళవారం ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీనగర్‌లో నివాసం ఉన్న ఫార్మా ఉద్యోగి భాస్కరరావు ఈ నెల ఒకటిన తమ పక్క ఇంట్లో ఉంటున్న యువతి స్నానం చేస్తుండగా వీడియో తీశాడనే అభియోగంతో ఆ యువకున్ని తీవ్రంగా కొట్టి గదిలో బంధించారు. ఈ విషయాన్ని విజయనగరంలో ఉంటున్న భాస్కరరావు తల్లిదండ్రులకు యువతి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు ఇక్కడకు వచ్చేసరికి భాస్కరరావు ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో యువతి కుటుంబ సభ్యులు తీసి లోపలకు వెళ్లి చూడగా భాస్కరరావు అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని కనిపించాడు. తమ కుమారుడిని కొట్టి చంపేసి ఉరి వేసుకున్నట్టు చిత్రీకరించారంటూ భాస్కరరావు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ప్రియాంక, హేమంత్, లక్ష్మి, మణికంఠ, హేమశేఖర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

19 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలు

ఆరిలోవ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : టెక్నికల్ సర్టిఫికెట్ పరీక్షలను ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, డ్రాయింగ్ ఎంబ్రాయిడర్ కోర్సునకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. హేండ్లూమ్ వీవింగ్ కోర్సుకు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 19 నుండి 22వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షల టైం టేబుల్ ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.

గంజాయి కేసులకు దూరంగా ఉండాలి

ఆరిలోవ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులంతా గంజాయి కేసులకు దూరంగా ఉండాలని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా సోమ శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం ఆయన విశాఖ కేంద్రకారగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జైలులో గల రిమాండ్ ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీరి కష్టాలకు ఆర్థిక ఇబ్బందులే కారణమన్నారు.




















జాతీయ టేబుల్ టెన్నిస్ టోర్నీ అంపైర్‌గా శర్మ నియామకం

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 4, (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7 నుంచి డెహ్రాడూన్‌లో జరిగే ప్రతిష్ఠాత్మక జాతీయ క్రీడల టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన ఎల్ఐసీ స్పోర్ట్సు ప్రమోషన్ బోర్డు మెంబరు డాక్టర్ డీవీఎస్‌వై.శర్మను అంపైర్‌గా నియమిస్తూ భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య



మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. శర్మ నియామకంపై ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదప్రసాద్ దాస్, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కామేశ్వరి, జి.వరప్రసాద్, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడు జె.కె.నాయక్‌లు హర్షం ప్రకటించారు.

గీత కార్మికుల అభ్యున్నతి ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న మధుసూదనరావు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, వారికి మద్యం దుకాణాల కేటాయింపులో పది శాతం రిజర్వేషన్ కల్పించడం టీడీపీ బీసీల పార్టీ అని రుజువైందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమాభివృద్ధి సంస్థ డైరెక్టర్ అనసూరి మధుసూదనరావు అన్నారు. నగరంలోని కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గీత కార్మికుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. 'గీసేవానికే చెట్టు' పథకం గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టగా, దోచుకునేవారిదే పాలసీ అంటూ గత వైసీపీ ప్రభుత్వం వ్యవహరించిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సుమారు 2 లక్షల మంది కార్మికులు కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు.

కనకమహాలక్ష్మి దర్శనానికి భక్తుల తాకిడి

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి పర్వదినం సందర్భంగా కనకమహాలక్ష్మి దర్శనానికి మంగళవారం ఉదయం నుంచి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. ఆలయం వద్ద అర్చకులు లక్ష కుంకుమార్చన పూజలు చేశారు. బంగారు పుష్పాలతో అలంకరించి వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

క్యాన్సర్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన

జ్ఞానాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్యాన్సర్ దినాన్ని పురస్కరించుకుని సెయింట్ జోసెఫ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రోగ్రాం అధికారిణి కె.మాణిక్యకుమారి మాట్లాడుతూ చెడు అలవాట్ల వల్ల వచ్చే క్యాన్సర్లు, మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్ నివారణ గురించి వివరించారు.

నడక మార్గాలే వ్యాపార కేంద్రాలు!

▸▸ పట్టించుకోని జీవీఎంసీ అధికారులు ▸▸ అవస్థలు పడుతున్న పాదచారులు

కంచరపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బాధ్యత మరచి ఎవరి ఇష్టానికి వారు వ్యవహరిస్తే ప్రజలకు పాట్లు తప్పవనడానికి కంచరపాలెం మెట్టు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు, షాపింగ్ మాల్స్ వద్ద నడక మార్గాల



నడకమార్గంపై ఏర్పాటు చేసిన దుకాణాలు

(:ఫుట్‌పాత్‌ల) ఆక్రమణలే నిదర్శనం. పాదచారులు నడవాల్సిన మార్గాలు.. చిల్లరవర్తకులు, వ్యాపారులతో నిండిపోయింది. ఫలితంగా వారు రోడ్డుమార్గంలోనే నడవాల్సి రావడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. వ్యాపారులు వారి దుకాణాల నుంచి నడక మార్గం దాటుకుని ప్రధాన రోడ్డులోకి చొరపడడంతో అందరికీ ఇబ్బందులు తప్పడం లేదు. పూర్తిస్థాయిలో టీడీఆర్‌లు చెల్లించి రోడ్డు విస్తరణ చేపట్టినప్పటికీ యధావిధిగా రోడ్డుమీదనే దుకాణాలు పెట్టి వ్యాపారాలు చేస్తుండడంతో ప్రభుత్వ లక్ష్యం ఆమడ దూరంలో ఉంటోంది. ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ఆక్రమణలను తొలగించాల్సిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడంతో వ్యాపా




మెట్టు వద్ద ఆక్రమణలతో నిండిన నడకమార్గం

రులు సొమ్ము చేసుకుంటున్నారు. నడకమార్గాల ఆక్రమణతో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఈ సమస్య నిత్యకృత్యంగా కనిపిస్తున్నా, జీవీఎంసీ, పోలీసు విభాగాలు దృష్టి సారించకపోవడం గమనార్హం. నడక మార్గాల ఆక్రమణలపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించి సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

నా వాళ్లు..పుస్తకావిష్కరణ

సీతంపేట (డాబాగార్డెన్స్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మేడా బుజ్జమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తాళాభక్తుల లక్ష్మీప్రసాద్ రచనలో 'నా వాళ్లు.. వాళ్ల ఆనవాళ్లు' పుస్తకావిష్కరణ సభను విశాఖ పౌరగ్రంథాలయంలో మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హోమియో వైద్య నిపుణుడు డా.మోటూరి రామకృష్ణ హాజరయ్యారు. ఆత్మీయ అతిథిగా సాహితీ రత్నాకర డా.డి.వి.సూర్యారావు, విశ్రాంత కార్మిక కమిషనర్ డీఆర్‌కే రావు హాజరై పుస్తకంలోని అంశాలను తమదైన శైలిలో విశ్లేషించారు. లక్ష్మీప్రసాద్ జీవితంలో తటస్థపడిన కొన్ని మూర్తిమత్వాలను పద్యరూపంలో రచన చే



పుస్తకావిష్కరణలో పాల్గొన్న అతిథులు

శారన్నారు. మేడ మస్తాన్‌రెడ్డి సభను నిర్వహించగా, రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, డా.కె.వి.ఎస్.మూర్తి, సీహెచ్ చిన సూర్యనారాయణ, ఆడపా రామకృష్ణ, ఉప్పల అప్పలరాజు, వర్రే నాంచారయ్య, నవరసమూర్తి, త్యాగరాజు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి తీర్మానం

మురళీనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి); మురళీనగర్ ప్రాంతంలో మొదటి పార్కుగా ఆరంభమైన వాకర్స్ పార్క్‌ను మరింతగా అభివృద్ధి చేసేందుకు అంతా కలసికట్టుగా కృషి చేయాలని వాకర్స్ క్లబ్ సభ్యులు తీర్మానించారు. క్లబ్ 30వ వార్షికోత్సవం మంగళవారం పార్క్ ప్రాంగణంలో జరిగింది. క్లబ్ ప్రెసిడెంట్ ఎస్.భానుప్రకాష్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో వాకర్స్ ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు ఎ.హెచ్.ఎస్.వెంకటరావు, సీనియర్ సభ్యుడు ఎస్.వరప్రసాద్, పూర్వ అధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం పాల్గొన్నారు. స్థానికుల్ని సంఘటిత శక్తిగా తయారుచేయడంలో వాకర్స్‌క్లబ్ ఎనలేని కృషి చేస్తోందని ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు పేర్కొన్నారు.

ఆహూతుల మది దోచిన మధుర గీతాలు

సీతంపేట (డాబాగార్డెన్స్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): శీతల్ స్వర సినీ సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పౌరగ్రంథాలయంలో నిర్వహించిన విభావరి ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, కళా సంస్థల ప్రతినిధి చెన్నా తిరుమలరావు, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, గాయకుడు బి.ఫణిభూషణ్ హాజరై జ్యోతి ప్రజ్వలనగావించారు. తదుపరి లక్ష్మీ స్వరూప సారథ్యంలో సినీ సంగీత విభావరిలో వెంకట్, పూర్ణిమ, నర్సింగ్, రంజిత, పల్లా బాబ్జీ, కృష్ణంరాజు, పూర్ణిమ, ఎల్.వెంకటేష్ తదితర గాయనీ గాయకులు ఆలపించిన జగదానంద కారక...నాలోన..రాగమీవే...ఎగిరిపోవాలి. వంటి పాటలు శ్రావ్యంగా ఆలపించి రసహృదయాలను ఆకట్టుకున్నారు. భయ్యా శ్రీనివాస్, అంజనేయరెడ్డి, అప్పారావు, మెలోడి సత్యనారాయణ, ఎమ్మెస్‌మాధవ్‌లు పలు గీతాలు ఆలపించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

ఈశ్రమ్ కార్డులతో ప్రయోజనం



దరఖాస్తు అందిస్తున్న డీసీఎల్ సునీత

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి కార్మికుడు ఈశ్రమ్ కార్డులు పొందాలని కార్మికశాఖ ఉప కమిషనర్ ఎం.సునీత సూచించారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని కార్మిక శాఖ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు ఈశ్రమ్ కార్డుల రిజిస్ట్రేషన్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం కార్మికులు దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కార్మిక కమిషనర్లు జి.రాజు, ఆర్.రమణ, ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు పడాల గోవింద్, ఎన్.మధు, వై.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉడాకాలనీ కమ్యూనిటీ హాలుకు సమకూరిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్

మురళీనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మాధవధార ఉడాకాలనీ నివాసితుల సంక్షేమ సంఘం నిర్వహణలో ఉన్న కమ్యూనిటీ హాలుకు అదనపులోడు సామర్థ్యంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఎన్ఎస్‌టీపీఎల్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ వెంకటేష్ సూచన మేరకు 65 కె.వి. ట్రాన్స్‌ఫార్మర్ సమకూరింది. పాత కమ్యూనిటీ హాలు ఒకే అంతస్థుగా ఉన్నప్పుడు ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌తోనే ప్రస్తుతం రెండు అంతస్థులుగా నవీకరించిన కమ్యూనిటీ హాలు నడుస్తోంది. వేడుకలకు విద్యుత్ లోడ్ అధికంగా అవసరం అవుతుండటంతో రూ.2.5 లక్షలు ఏపీఈపీడీసీఎల్‌కు చెల్లించి కమ్యూనిటీ హాలు పాలకవర్గ సభ్యులు శాశ్వత సదుపాయం కల్పించారు. రెండు ఫ్లోర్లలో రెండు వేర్వేరు ఫంక్షన్లు ఏర్పాటవుతుండటంతో లైటింగ్, ఏసీ, ఫ్యాన్‌లు సహా అదనపు విద్యుత్ వినియోగం కోసం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు.

టీడీఆర్‌ల జారీలో ఆరోపణలపై కలెక్టర్ ఆరా

▸▸ నివేదిక ఇవ్వాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశం

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో టీడీఆర్‌ల జారీలో అక్రమాలు జరిగాయంటూ వెల్లువెత్తుతున్న ఆరోపణలపై జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హోదాలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆరా తీసినట్టు తెలిసింది. పత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందించిన ఆయన ఆరోపణలకు సంబంధించిన టీడీఆర్‌ల ఫైళ్లు తీసుకురావడంతోపాటు ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణతో కూడిన నివేదిక ఇవ్వాలని చీఫ్‌సిటీ ప్లానర్ ప్రభాకరరావును ఆదేశించినట్టు సమాచారం. మంగళవారం సాయంత్రం చీఫ్‌సిటీ ప్లానర్ ప్రభాకరరావు కలెక్టర్‌ను కలవడంతో టీడీఆర్‌లపై ఆరోపణలకు సంబంధించి వివరణ ఇచ్చేందుకే వెళ్లారని ఆ విభాగం అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఫైళ్లను పరిశీలించి కలెక్టర్ ఒక నివేదికను రాష్ట్రప్రభుత్వానికి పంపించే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఉద్యోగం నుంచి తొలగించారని దురాగతం!

▸▸ కేజీహెచ్‌లో పిల్లల వార్డుకు ఆక్సిజన్ అందించే పైప్ కోసేందుకు యత్నం

▸▸ రౌడీషీటర్ సహా నిందితుల అరెస్టు ▸▸ సీఐ దేముడుబాబు వెల్లడి

మహారాణిపేట (విశాఖపట్నం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తనను ఉద్యోగం నుంచి తొలగించారనే కోపంతో కేజీహెచ్ పిల్లల వార్డుకు ఆక్సిజన్ అందించే పైపును కత్తిరించేందుకు యత్నించిన రౌడీషీటర్, అతనికి సహకరించిన మరో ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సీఐ జె.దేముడుబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం...ఏవీఎన్ కాలేజీ డౌన్ ప్రాంతంలో నివాసం ఉంటున్న రాజు కేజీహెచ్‌లో పనిచేసేవాడు. పిల్లలపై అత్యాచారయత్నానికి పాల్పడడం, మద్యం తాగి ఆసుపత్రిలో విధులకు హాజరుకావడం, అనేక నేరారోపణలు రావడంతో అతడిని విధుల నుంచి తొలగించారు. రాజుపై పోలీసులు రౌడీ షీట్ కూడా తెరిచారు. ఈ క్రమంలో వైద్యులపై కోపం పెంచుకున్న రాజు కేజీహెచ్‌లోని పిల్లల వార్డుకు ఆక్సిజన్ సరఫరా చేసే పైపులను ఈ నెల ఒకటో తేదీ మధ్యాహ్నం కత్తిరించేందుకు యత్నించాడు. అది గమనించిన సెక్యూరిటీ గార్డులు అడ్డుకునేందుకు యత్నించగా, వారిని కత్తితో బెదిరించి అక్కడ నుంచి పరారయ్యాడు. పిల్లలకు ప్రాణవాయువు (ఆక్సిజన్) అందకుండా చేసి, వారి ప్రాణాలు తీయాలనే దురుద్దేశంతో మరో ఇద్దరి సహాయంతో రాజు ఈ దురాగతానికి తెగబడ్డాడు. ఈ సమాచారం అందుకున్న సీఐ ఆధ్వర్యంలోని పోలీసు బృందం హుటాహుటిన కేజీహెచ్‌కు వెళ్లి సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. వైద్యాధికారుల ఫిర్యాదు మేరకు రాజును, అతనికి సహకరించిన మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ వివరించారు. రాజుపై పలు కేసులు ఉన్నట్టు తెలిపారు.

యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణకు మరో చాన్స్

... 5వ పేజీ తరువాయి

దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్, పట్టణ భూగరిష్ఠ పరిమితి కాంపిటెంట్ అధికారి కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ జీవో మేరకు 2019 మే ఒకటో తేదీ నాటికి సదరు మిగులు భూమిలో ఉన్నట్టు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఇంటి నిర్మాణం కోసం జీవీఎంసీ నుంచి తీసుకున్న ప్లాన్, కరెంట్ బిల్లు, ఇంటి, నీటి పన్ను రశీదు నకళ్లతో డిసెంబరు 31వ తేదీలోగా క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు సంబంధిత తహసీల్దార్ లేదా కలెక్టరేట్‌లోని యూఎల్‌సీ విభాగంలో అందజేయాలని కోరారు. 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరించి పట్టా ఇస్తారు. 150 నుంచి 300 గజాల వరకు ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువలో 15 శాతం, 300 నుంచి 500 గజాల వరకు 30 శాతం, 500 గజాలు, ఆపైన...అయితే 100 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఆ మొత్తం లెక్కించి సగం సొమ్మును 'జాయింట్ కలెక్టర్ అండ్ కాంపిటెంట్ అథారిటీ, అర్బన్ ల్యాండ్ సీలింగ్, విశాఖపట్నం పేరిట డీడీ తీసి దరఖాస్తుకు జత చేసి అందజేయాలన్నారు. సందేహాలు, ఇతర వివరాలకు సంబంధిత తహసీల్దారు కార్యాలయంలో సంప్రతించాలని కోరారు. నగరంలో సీతమ్మధార, గోపాలపట్నం, మహారాణిపేట, గాజువాక, ములగాడ, పెదగంట్యాడ, పెందుర్తి, విశాఖ రూరల్ తహసీల్దార్ కార్యాలయాల పరిధిలో 266 హెక్టార్ల యూఎల్‌సీ భూములు ఉన్నట్టు అధికారులు గతంలో నిర్ధారించారు. వాటిలో 86 హెక్టార్లలో ఆక్రమణలు ఉన్నట్టు గుర్తించారు. మరో 100 హెక్టార్ల భూమిని ఇంకా గుర్తించాల్సి ఉండగా, 80 హెక్టార్లలో రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, సామాజిక భవనాలు ఉన్నాయని చెబుతున్నారు. ఆ 86 హెక్టార్లలో సుమారు 3,025 ఆక్రమణలు ఉన్నట్టు అప్పట్లో గుర్తించి 2023 మార్చి తరువాత 1,583 మందికి నోటీసులు ఇచ్చారు. మిగిలిన వారికి నోటీసులు ఇస్తే అప్పట్లో చాలామంది తీసుకోలేదు. 2023 డిసెంబరు 31తో గడువు ముగిసేనాటికి 687 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 150 గజాల కంటే తక్కువ విస్తీర్ణం ఉన్న ఆక్రమణదారులు 643 మంది, 150 గజాల పైబడి విస్తీర్ణం ఉన్నవారు 44 మంది ఉన్నారు. పలు కారణాలతో 150 దరఖాస్తులు తిరస్కరించగా, 150 గజాల కంటే తక్కువ విస్తీర్ణం ఉన్నవి 386, అంతకు మించినవి 44 వెరసి 430 దరఖాస్తులు పరిశీలించి క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వానికి పంపారు. 150 గజాల విస్తీర్ణం పైబడి ఆక్రమణదారులు రూ.3.52 కోట్లు చెల్లించారు. అయితే ప్రభుత్వానికి దరఖాస్తులు పంపినా ఒక్కటి కూడా క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు ఇవ్వలేదు. దరఖాస్తుదారులు కలెక్టరేట్‌కు వచ్చి విచారిస్తూనే ఉన్నారు. చివరకు గత నెలలో జరిగిన క్యాబినెట్‌లో యూఎల్‌సీ ఆక్రమణలపై చర్చించిన మీదట గత నెల 27న జీవో ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవోను యథాతథంగా అమలు చేస్తూ కేవలం దరఖాస్తుల సమర్పణకు డిసెంబరు 31వ తేదీ వరకూ గడువు మాత్రమే పెంచారు.

మహా దుబారా

... 5వ పేజీ తరువాయి

వీలుగా 'ఐ లవ్ వైజాగ్' బోర్డు ఏర్పాటుచేయగా, అది మూన్నాళ్లకే విరిగిపోవడంతో తిరిగి జీవీఎంసీ అధికారులే నిధులు వెచ్చించి కొత్త బోర్డు పెట్టించారు.

కనిపించని బయో రెమిడేషన్

నగరంలోని మురుగునీరు సముద్రంలో కలుస్తుంటుంది. జీ-20 సదస్సుకు వచ్చే ప్రతినిధులు బీచ్‌రోడ్డులో ప్రయాణించినప్పుడు అది చూస్తే నగరంపై ప్రతికూల భావన కలుగుతుందని అధికారులు అనుకున్నారు. అందుకే సాగర్‌నగర్ వద్ద బీచ్‌రోడ్డు కింద నుంచి ప్రవహించే మురుగు నీటి కాలువపై తేలియాడే మొక్కలను పెంచుతామంటూ 'బయో రెమిడేషన్' పేరుతో భారీగా నిధులు ఖర్చుపెట్టారు. పీవీసీ పైపులను కట్ చేసి వాటిల్లో ప్రత్యేకంగా దిగుమతి చేసుకున్న మొక్కలను నాటారు. మురుగునీటి కాలువ బయటకు కనిపించకుండా పైపుల్లో నాటిన మొక్కలు మాత్రమే తేలియాడేలా చేశారు. మొక్కలు మురుగునీటికాలువలోని హానికరమైన వ్యర్థాలతో కూడిన నీటిని తీసుకుంటాయి కాబట్టి, సుందరీకరణతోపాటు సముద్ర జలాల కాలుష్యానికి కూడా చెక్ పెట్టవచ్చునంటూ అధికారులు అప్పట్లో చెప్పుకొచ్చారు. తర్వాత వీటి నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఇప్పుడు అక్కడ మొక్కలు మాత్రమేకాదు...పైపులు కూడా మచ్చుకైనా కనిపించడం లేదు.

వ్యూపాయింట్ వద్ద పాడైపోయిన నడకదారి

సీతకొండ వ్యూపాయింట్ వద్ద సందర్శకులు నడిచేందుకు వీలుగా సముద్ర తీరం వైపు ప్రత్యేకంగా రాళ్ల పలకలతో నడకదారి నిర్మించారు. నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో రాతి పలకలన్నీ పైకి లేచిపోయి చిందరవందరగా పడి ఉన్నాయి. ఆ మార్గంలో నడిచేవారు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా సరే వాటిని తన్నుకుని కిందపడిపోయే ప్రమాదం ఉంది. అక్కడకు సమీపంలో తారురోడ్డు కూడా పాడైపోవడం పనుల్లో నాణ్యతాలోపాన్ని తెలియజేస్తోంది.

దిగొచ్చిన కూరగాయల ధరలు

... 5వ పేజీ తరువాయి

రూ.22కి లభిస్తున్నాయి. గ్రీన్ పీస్ (బఠాణీలు) జనవరి మొదటి వారంలో కిలో రూ.100 పైనే విక్రయించారు. ఇప్పుడు కిలో రూ.40కే అమ్ముతున్నారు. బీరకాయలు, బెండకాయల ధర మాత్రం తగ్గలేదు. ప్రస్తుతం బీర కిలో రూ.50, బెండకాయలు కిలో రూ.40 చొప్పున విక్రయిస్తున్నారు. ఇవి మార్కెట్‌కు తక్కువ మోతాదులో రావడంతో మంచి రేటు పలుకుతున్నదని రైతులు చెబుతున్నారు. అల్లం కిలో రూ.100 వరకు ధర పలకగా ఇప్పుడు కొత్తది రావడంతో రూ.44కే ఇస్తున్నారు. నగరంలో ఎక్కువ మంది కూరగాయలు కొనడానికి రైతుబజార్లకే వస్తారు. అయితే ధరలు బాగా తగ్గడంతో రోజువారీ వ్యాపారాలు చేసేవారు టమాటా, ఉల్లి వంటి సరకులు హోల్‌సేల్‌గా కొని ఆటోల్లో వేసుకొని వీధివీధికీ తిరిగి అమ్ముతున్నారు. దాంతో చాలామంది వారి వద్దే కొనుక్కుంటున్నారు. దీంతో రైతుబజార్లపై ఒత్తిడి తగ్గింది. స్టాళ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

నకిలీ బిల్లులతో ఇసుక

... 5వ పేజీ తరువాయి

నగరంలో ఎక్కడకు ఇసుక రవాణా చేస్తుంటారో ఆ వివరాలన్నీ బిల్లులో ఉంటాయి. రీచ్ నుంచి విశాఖపట్నం వరకు మధ్యలో గనుల శాఖ, పోలీసులు, రెవెన్యూ అధికారులు తనిఖీ చేసినప్పుడు బిల్లులు చూపించాలి. కొద్దిరోజులుగా శ్రీకాకుళం జిల్లా నుంచి విశాఖ నగరానికి నకిలీ బిల్లులతో కొందరు లారీ యజమానులు/డ్రైవర్లు ఇసుక తీసుకువస్తున్నారు. రీచ్‌లలో పనిచేసే కొందరు సిబ్బందితో కుమ్మక్కై టన్నుకు అధికారికంగా రూ.200 చెల్లించకుండా ఇసుక లోడ్ చేసుకుంటున్నారు. ఉదాహరణకు 30 టన్నుల లోడ్‌కు రీచ్ నిర్వాహకులకు రూ.6 వేలు చెల్లించాలి. రీచ్‌లో కొందరు సిబ్బంది 30 టన్నుల లోడ్‌కు రూ.3 వేలు మాత్రమే తీసుకుని నకిలీ బిల్లులు ఇస్తున్నారు. ఇంకా రీచ్‌లకు ఆనుకుని గ్రామాల్లో కొందరు తమ పొలాలు/తోటల్లో నిల్వ చేసిన ఇసుకను విక్రయిస్తున్నారు. వారు బిల్లులు ఇవ్వరు. అటువంటప్పుడు రీచ్‌లలో పనిచేసే కొందరు సిబ్బందితో మాట్లాడి నకిలీ బిల్లులు తీసుకుంటున్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో గడచిన వారం రోజుల్లో గనుల శాఖలో రెగ్యులర్, విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించి నకిలీ బిల్లులతో ఉన్న ఏడు లారీలను సీజ్ చేశారు. భారీగా జరిమానా విధించారు. అలాగే ఒకే బిల్లుపై రెండు, మూడు రోజులపాటు ఇసుక రవాణా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గనుల శాఖ, విజిలెన్స్ అధికారులు మరింత నిఘా పెంచాలని నిర్ణయించారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు



లలితాపీఠంలో సూర్యనమస్కారాలు చేస్తున్న పండితులు



అల్లిపురం వెంకటేశ్వరమెట్టపై అలవేలు మంగమ్మ ఆలయంలో సూర్యనారాయణస్వామికి అలంకరణ

అల్లిపురం/డాబాగార్డెన్స్/కంచరపాలెం/అక్కయ్యపాలెం/మాధవధార/జగదాంబ కూడలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నమస్కార ప్రియుడు, ఆరోగ్య ప్రదాత అయిన సూర్యనారాయణ స్వామిని రథసప్తమి సందర్భంగా మంగళవారం ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల ప్రజలు భక్తితో ప్రణమిల్లారు. సూర్యోదయ సమయంలో అర్ఘ్యం సమర్పించారు. ఆలయాలు, గృహాల్లో సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. ఆరుబయట పరమాన్నం వండి నైవేద్యం సమర్పించారు. అల్లిపురం వెంకటేశ్వరమెట్ట అలవేలు మంగమ్మ దేవాలయ ప్రాంగణంలో ఉషా చాయాదేవి సమేత సూర్యనారాయణ స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన అర్చకులు వైఖానస ఆగమ సంప్రదాయంలో పూజలు చేశారు. స్వామికి ప్రీతికరమైన క్షీరాన్నం నివేదించి భక్తులకు పంచిపెట్టారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు. డాబాగార్డెన్స్‌లో ఆలయ ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి సూర్యభగవానుని ఆరాధించారు. గొల్లకంచరపాలెం, రెడ్డికంచరపాలెం, తుమ్మడిపాలెం, సూర్యనగర్,తిక్కవానిపాలెం ఆలయాల్లో భక్తులు పూజలు, సామూహిక సూర్యనమస్కారాలు చేశారు. సూర్యనగర్-2లో గల యోగాసిద్ధాంజనేయ ఆలయంలో స్వామిని సూర్య భగవానుడిగా అలంకరించి, సింధూర అభిషేకం చేశారు. తమలపాకులతో ప్రత్యేక అలంకరణ చేశారు. అక్కయ్యపాలెంలోని లలితాపీఠంలో సూర్య నమస్కారాలు, మహా సౌర అరుణ హోమం నిర్వహించారు. మానవాళికి ఆరోగ్యం, గ్రహదోష నివారణ, సర్వకార్య జయం, ఐశ్వర్యం ఇవ్వాలని ప్రార్థించారు. పోర్టుస్టేడియంలో విద్యార్థులు సామూహికంగా యోగాసనాలు వేశారు. కనకమహాలక్ష్మి ఆలయం పైఅంతస్తు వద్ద పరమాన్నం చేసి సూర్యదేవునికి నైవేద్యం పెట్టి ఆరోగ్యం ప్రసాదించాలంటూ వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో జేఈవో తిరుమలేశ్వరావు, ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు. మాధవధార గాంధీనగర్ రామాలయ ప్రాంగణంలో సూర్యభగవానునికి పంచామృతాభిషేకాలు, సామూహిక అర్చనలు చేపట్టారు. అనంతరం గ్రామ వాసులతో కలసి సామూహిక వంటకం చేయించారు. ఆరుబయట పొయ్యిలో ప్రతి భక్తుడు తలో పిడికెడు బియ్యం వేసి, పరమాన్నం వండి నైవేద్యంగా సమర్పించారు.



కనకమహాలక్ష్మి ఆలయం పైభాగాన పరమాన్నం వండి సూర్యదేవునికి నివేదన ఇస్తున్న దృశ్యం


ఆరిలోవ : గోశాలలో సూర్యభగవానుడికి పూజలు చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో రథసప్తమి పూజలు

ఆరిలోవ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : రథసప్తమిని పురస్కరించుకొని జీవీఎంసీ 13వ వార్డులోని శ్రీకృష్ణాపురంలో గల గోశాల వద్ద సూర్యనారాయణ స్వామి విగ్రహం వద్ద మంగళవారం ఉదయం అధిక సంఖ్యల భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల తాడికి ఎక్కువగా ఉండడం, సింహాచలం దేవస్థానం అధికారులు ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఇబ్బంది తలెత్తింది. కార్యక్రమంలోసింహాచలం దేవస్థానం ఏఈవో ఆనంద కుమార్, ఈఈ రాంబాబు, డీఈ శ్రీహరి, టీడీపీ 13వ వార్డు అధ్యక్షుడు దర్మారావు, కార్యదర్శి యల్లమిల్లి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.


వెంకోజీపాలెం : వైభవ వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

తోటగరువు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు సూర్యనమస్కారాలు, యోగాసనాలు వేశారు. పాఠశాల హెచ్ఎం వి.విశ్వనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యప్రకాష్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు సుబ్రహ్మణ్యశాస్త్రి, బాల భాస్కరశర్మ భక్తులకు పూజాధికార్యక్రమాలు చేపట్టారు.కొత్త వెంకోజీపాలెంలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీచక్రం వేసి అర్చకులు కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో సూర్య నమస్కారాలు చేశారు. హెచ్‌బీ కాలనీ శివాలయంలోని వేంచేసి ఉన్న సూర్యనారాయణ స్వామి ఆలయంలోతెల్లవారు జామునుంచి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం సూర్యనారాయణ స్వామికి కల్యాణం జరిపారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులచే శ్రీస్వామివారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, భక్తుల గోత్రనామాలతో అర్చకులు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా బడ్డీల తొలగింపు

- స్టీల్‌ప్లాంటు, జీవీఎంసీ సిబ్బంది హడావుడి
- విద్యుత్ శాఖ నుంచి సహకారం అందకపోవడంతో ఇబ్బందికర పరిస్థితి


ఖాళీగా ఉన్న బడ్డీలను తొలగిస్తున్న స్టీల్‌ప్లాంట్ సిబ్బంది


దుకాణదారులతో మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ ఎస్టేట్ అధికారి జగన్నాథరావు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డులోని హెచ్‌బీ కాలనీ నుంచి సులభ్ కాంప్లెక్సు సమీపంలో ఉన్న బడ్డీలను జీవీఎంసీ సిబ్బందితో కలిసి స్టీల్‌ప్లాంటు స్టాఫ్ తొలగించారు. 'ప్రభుత్వం మారినా.. ఆక్రమణలు తొలగలేదు' శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్పందించిన స్టీల్‌ప్లాంట్ అధికారులు బడ్డీల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. అయితే ఆక్రమణ బడ్డీలను మాత్రం 'తూతూమంత్రం' అన్నట్టుగా తొలగించారు.

హెచ్‌బీ కాలనీ సులభ్ కాంప్లెక్సు వద్ద పదుల సంఖ్యలో ఆక్రమణ బడ్డీలు ఉంటే కేవలం వ్యాపారం సాగించకుండా ఖాళీగా ఉన్న రెండు మూడు బడ్డీలను మాత్రమే క్రేన్‌లు, సిబ్బందితో వచ్చి హడావుడి సృష్టించి తొలగించి చేతులు దులుపుకున్నారు. 'ఇదేమిటని..' కొందరు ప్రశ్నించగా.. విద్యుత్ శాఖ సహకారం లేదని, బడ్డీలకు విద్యుత్ సరఫరా నిలిపివేయమని తాము 4 నెలల క్రితమే లేఖను సమర్పించిన విద్యుత్ శాఖ వారు మాత్రం ఎటువంటి స్పందన లేదని స్టీల్‌ప్లాంట్ ఎస్టేట్ అధికారి జగన్నాథరావు చెప్పారు. బడ్డీలు జీవీఎంసీకి చెందిన రోడ్డుపై ఉన్నాయని, వాటిని తొలగించమని జీవీఎంసీ తరుపున తమకు లేఖను ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారని ఆయన తెలిపారు. విద్యుత్ శాఖ సహకారం లేకపోతే తాము బడ్డీలను తొలగించడం సాధ్యం కాదని చెప్పుకొచ్చారు. విద్యుత్ శాఖ, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు సహకరిస్తేనే ఆక్రమణ బడ్డీలను తొలగించడం సాధ్యపడుతుందని ఎస్టేల్ అధికారి తెలిపారు.

బడ్డీల కారణంగా ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందని, అంతేకాకుండా అక్రమంగా బడ్డీలను ఏర్పాటు చేసి అద్దెలతో పాటు దందాలను కూడా వైసీపీ నేతలు నిర్వహిస్తున్నారని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతో కేవలం స్టీల్ ప్లాంట్ సిబ్బందిలో మాత్రమే కదలిక వచ్చింది. మిగిలిన జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్, విద్యుత్ శాఖలో మాత్రం ఎటువంటి చలనం కలుగకపోవడంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారాలు సాగిస్తున్న బడ్డీలకు జీవీఎంసీ వారు పన్నులు విధించడం, విద్యుత్ శాఖ వారు మీటర్లు ఇస్తుంటే ఆక్రమణలకు అడ్డుకట్ట ఎక్కడ వేస్తున్నట్టని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ ఆక్రమణలకు అడ్డుకట్ట వేసి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

తడి నేలలు పర్యావరణ హితం


సదస్సులో పాల్గొన్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : తడినేలలు పర్యావరణానికి హితమని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు చెప్పారు. కళాశాలలో మంగళవారం ప్రపంచ చిత్తడి నేల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు తడినేలలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తడినేలలు నీటిని అందించడమే కాకుండా పర్యావరణ ఆరోగ్యాన్ని అందిస్తాయన్నారు. సుస్థిరమైన పట్టణ భవిష్యత్‌కు తడి భూములు దోహదపడతాయన్నారు. అం దుకే తడినేలలు పరిరక్షించుకోవడానికి ఒప్పందం కుదిరిన ఫిబ్రవరి 2న ప్రపంచ తడి నేల దినోత్సవం జరుపుతారని, ఆ ఏడాది మొత్తం ఇక థీమ్‌తో చిత్తడి నేలలపై అవగాహన కల్పిస్తారన్నారు. భూమి, నీరు కలిసే ప్రాంతాన్నే చిత్తడి నేల అంటారని, ఇదీ కొద్ది నెలలు, సంవత్సరం కలిసి వుండడం వలన అక్కడ ఎన్నో జీవరాశులు జీవించడమేకాకుండా పర్యావరణానికి మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పద్మావతి, పుష్పలత, సుజాత, రామలక్ష్మణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కనకమ్మవారి పరస

మద్దిలపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక చైతన్యనగర్‌లో కొలువైయున్న కనకమ్మవారి పరస మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం చైతన్యనగర్‌లో జాతర ఏర్పాటు చేసి తినుబండరాళ్ల, బొమ్మల స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఏయూను సందర్శించిన ఎస్టీ కమిషన్ సభ్యుడు


ఏయూ అధికారులతో ఎస్టీ కమిషన్ సభ్యుడు

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులతో ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వి.సోమశంకర్‌నాయక్ మంగళవారం భేటీ అయ్యారు. వర్సిటీలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారి సమస్యలు పరిష్కరించే చర్యలు చేపట్టాలన్నారు. వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్ ప్రొఫెసర్ బసవయ్య, ప్రొఫెసర్ జర్రా అప్పారావు,ప్రొఫెసర్ అరుణ్‌కుమార్, ప్రొఫెసర్ పడాల్, కుంజం నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు ఆర్థిక సహాయం

మద్దిలపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రోటరీ క్లబ్ విశాఖ ఆధ్వర్యంలో అంధ విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హెల్ప్ ద బ్లైండ్ ఫౌండేషన్ నిర్వాహకుడు శివాజీరావు మాట్లాడుతూ ఇలాంటి విద్యార్థులకు సహాయం అందజేస్తే చదువుకోగలుగుతారన్నారు. ప్రిన్సిపాల్ విజయబాబు మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సేవా తత్వంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు పి.ధనలక్ష్మి, కె.రవిబాబు, ఎం.రాజేశ్వరరావు, పోలా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

యువకుడి మృతి కేసులో ఐదుగురి అరెస్టు

గాజువాక, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గాజువాకలోని శ్రీనగర్ ప్రాంతంలో ఈ నెల ఒకటో తేదీన అనుమానాస్పదంగా మృతి చెందిన జి.భాస్కరరావు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులు మంగళవారం ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీనగర్‌లో నివాసం ఉన్న ఫార్మా ఉద్యోగి భాస్కరరావు ఈ నెల ఒకటిన తమ పక్క ఇంట్లో ఉంటున్న యువతి స్నానం చేస్తుండగా వీడియో తీశాడనే అభియోగంతో ఆ యువకున్ని తీవ్రంగా కొట్టి గదిలో బంధించారు. ఈ విషయాన్ని విజయనగరంలో ఉంటున్న భాస్కరరావు తల్లిదండ్రులకు యువతి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు ఇక్కడకు వచ్చేసరికి భాస్కరరావు ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో యువతి కుటుంబ సభ్యులు తీసి లోపలకు వెళ్లి చూడగా భాస్కరరావు అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని కనిపించాడు. తమ కుమారుడిని కొట్టి చంపేసి ఉరి వేసుకున్నట్టు చిత్రీకరించారంటూ భాస్కరరావు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ప్రియాంక, హేమంత్, లక్ష్మి, మణికంఠ, హేమశేఖర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

19 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలు

ఆరిలోవ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : టెక్నికల్ సర్టిఫికెట్ పరీక్షలను ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, డ్రాయింగ్ ఎంబ్రాయిడర్ కోర్సునకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. హేండ్లూమ్ వీవింగ్ కోర్సుకు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 19 నుండి 22వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షల టైం టేబుల్ ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.

గంజాయి కేసులకు దూరంగా ఉండాలి

ఆరిలోవ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులంతా గంజాయి కేసులకు దూరంగా ఉండాలని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా సోమ శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం ఆయన విశాఖ కేంద్రకారగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జైలులో గల రిమాండ్ ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీరి కష్టాలకు ఆర్థిక ఇబ్బందులే కారణమన్నారు.

జాతీయ టేబుల్ టెన్నిస్ టోర్నీ అంపైర్‌గా శర్మ నియామకం

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 4, (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7 నుంచి డెహ్రాడూన్‌లో జరిగే ప్రతిష్ఠాత్మక జాతీయ క్రీడల టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెందిన ఎల్‌ఐసీ స్పోర్ట్సు ప్రమోషన్ బోర్డు మెంబరు డాక్టర్ డీవీఎస్‌వై.శర్మను అంపైర్‌గా నియమిస్తూ భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్య



మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. శర్మ నియామకంపై ఎల్‌ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదప్రసాద్ దాస్, ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కామేశ్వరి, జి.వరప్రసాద్, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడు జె.కె.నాయక్‌లు హర్షం ప్రకటించారు.

గీత కార్మికుల అభ్యున్నతి ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న మధుసూదనరావు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, వారికి మద్యం దుకాణాల కేటాయింపులో పది శాతం రిజర్వేషన్ కల్పించడం టీడీపీ బీసీల పార్టీ అని రుజువైందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమాభివృద్ధి సంస్థ డైరెక్టర్ అనసూరి మధుసూదనరావు అన్నారు. నగరంలోని కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గీత కార్మికుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. 'గీసేవానికే చెట్టు' పథకం గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టగా, దోచుకునేవారిదే పాలసీ అంటూ గత వైసీపీ ప్రభుత్వం వ్యవహరించిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సుమారు 2 లక్షల మంది కార్మికులు కల్లు గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు.

కనకమహాలక్ష్మి దర్శనానికి భక్తుల తాకిడి

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి పర్వదినం సందర్భంగా కనకమహాలక్ష్మి దర్శనానికి మంగళవారం ఉదయం నుంచి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. ఆలయం వద్ద అర్చకులు లక్ష కుంకుమార్చన పూజలు చేశారు. బంగారు పుష్పాలతో అలంకరించి వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

క్యాన్సర్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన

జ్ఞానాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్యాన్సర్ దినాన్ని పురస్కరించుకుని సెయింట్ జోసెఫ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రోగ్రాం అధికారిణి కె.మాణిక్యకుమారి మాట్లాడుతూ చెడు అలవాట్ల వల్ల వచ్చే క్యాన్సర్లు, మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్ నివారణ గురించి వివరించారు.

నడక మార్గాలే వ్యాపార కేంద్రాలు!

▸▸ పట్టించుకోని జీవీఎంసీ అధికారులు ▸▸ అవస్థలు పడుతున్న పాదచారులు

కంచరపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బాధ్యత మరచి ఎవరి ఇష్టానికి వారు వ్యవహరిస్తే ప్రజలకు పాట్లు తప్పవనడానికి కంచరపాలెం మెట్టు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు, షాపింగ్ మాల్స్ వద్ద నడక మార్గాల



నడకమార్గంపై ఏర్పాటు చేసిన దుకాణాలు

(ఫుట్‌పాత్‌ల) ఆక్రమణలే నిదర్శనం. పాదచారులు నడవాల్సిన మార్గాలు.. చిల్లరవర్తకులు, వ్యాపారులతో నిండిపోయింది. ఫలితంగా వారు రోడ్డుమార్గంలోనే నడవాల్సి రావడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. వ్యాపారులు వారి దుకాణాల నుంచి నడక మార్గం దాటుకుని ప్రధాన రోడ్డులోకి చొరపడడంతో అందరికీ ఇబ్బందులు తప్పడం లేదు. పూర్తిస్థాయిలో టీడీఆర్‌లు చెల్లించి రోడ్డు విస్తరణ చేపట్టినప్పటికీ యథావిధిగా రోడ్డుమీదనే దుకాణాలు పెట్టి వ్యాపారాలు చేస్తుండడంతో ప్రభుత్వ లక్ష్యం ఆమడ దూరంలో ఉంటోంది. ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ఆక్రమణలను తొలగించాల్సిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడంతో వ్యాపా




మెట్టు వద్ద ఆక్రమణలతో నిండిన నడకమార్గం

రులు సొమ్ము చేసుకుంటున్నారు. నడకమార్గాల ఆక్రమణతో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఈ సమస్య నిత్యకృత్యంగా కనిపిస్తున్నా, జీవీఎంసీ, పోలీసు విభాగాలు దృష్టి సారించకపోవడం గమనార్హం. నడక మార్గాల ఆక్రమణలపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టి సారించి సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

నా వాళ్లు..పుస్తకావిష్కరణ

సీతంపేట (డాబాగార్డెన్స్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మేడా బుజ్జమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తాళాభక్తుల లక్ష్మీప్రసాద్ రచనలో 'నా వాళ్లు.. వాళ్ల ఆనవాళ్లు' పుస్తకావిష్కరణ సభను విశాఖ పౌరగ్రంథాలయంలో మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హోమియో వైద్య నిపుణుడు డా.మోటూరి రామకృష్ణ హాజరయ్యారు. ఆత్మీయ అతిథిగా సాహితీ రత్నాకర డా.డి.వి.సూర్యారావు, విశ్రాంత కార్మిక కమిషనర్ డీఆర్‌కే రావు హాజరై పుస్తకంలోని అంశాలను తమదైన శైలిలో విశ్లేషించారు. లక్ష్మీప్రసాద్ జీవితంలో తటస్థపడిన కొన్ని మూర్తిమత్వాలను పద్యరూపంలో రచన చే



పుస్తకావిష్కరణలో పాల్గొన్న అతిథులు

శారన్నారు. మేడ మస్తాన్‌రెడ్డి సభను నిర్వహించగా, రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, డా.కె.వి.ఎస్.మూర్తి, సీహెచ్ చిన సూర్యనారాయణ, ఆడపా రామకృష్ణ, ఉప్పల అప్పలరాజు, వర్రే నాంచారయ్య, నవరసమూర్తి, త్యాగరాజు పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధికి తీర్మానం

మురళీనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి); మురళీనగర్ ప్రాంతంలో మొదటి పార్కుగా ఆరంభమైన వాకర్స్ పార్క్‌ను మరింతగా అభివృద్ధి చేసేందుకు అంతా కలసికట్టుగా కృషి చేయాలని వాకర్స్ క్లబ్ సభ్యులు తీర్మానించారు. క్లబ్ 30వ వార్షికోత్సవం మంగళవారం పార్క్ ప్రాంగణంలో జరిగింది. క్లబ్ ప్రెసిడెంట్ ఎస్.భానుప్రకాష్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో వాకర్స్ ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు ఎ.హెచ్.ఎస్.వెంకటరావు, సీనియర్ సభ్యుడు ఎస్.వరప్రసాద్, పూర్వ అధ్యక్షులు ఎన్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం పాల్గొన్నారు. స్థానికుల్ని సంఘటిత శక్తిగా తయారుచేయడంలో వాకర్స్‌క్లబ్ ఎనలేని కృషి చేస్తోందని ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు పేర్కొన్నారు.

ఆహూతుల మది దోచిన మధుర గీతాలు

సీతంపేట (డాబాగార్డెన్స్), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): శీతల్ స్వర సినీ సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పౌరగ్రంథాలయంలో నిర్వహించిన విభావరి ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి, కళా సంస్థల ప్రతినిధి చెన్నా తిరుమలరావు, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, గాయకుడు బి.ఫణిభూషణ్ హాజరై జ్యోతి ప్రజ్వలనగావించారు. తదుపరి లక్ష్మీ స్వరూప సారథ్యంలో సినీ సంగీత విభావరిలో వెంకట్, పూర్ణిమ, నర్సింగ్, రంజిత, పల్లా బాబ్జీ, కృష్ణంరాజు, పూర్ణిమ, ఎల్.వెంకటేష్ తదితర గాయనీ గాయకులు ఆలపించిన జగదానంద కారక...నాలోన..రాగమీవే...ఎగిరిపోవాలి. వంటి పాటలు శ్రావ్యంగా ఆలపించి రసహృదయాలను ఆకట్టుకున్నారు. భయ్యా శ్రీనివాస్, అంజనేయరెడ్డి, అప్పారావు, మెలోడి సత్యనారాయణ, ఎమ్మెస్‌మాధవ్‌లు పలు గీతాలు ఆలపించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

ఈశ్రమ్ కార్డులతో ప్రయోజనం



దరఖాస్తు అందిస్తున్న డీసీఎల్ సునీత

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి కార్మికుడు ఈశ్రమ్ కార్డులు పొందాలని కార్మికశాఖ ఉప కమిషనర్ ఎం.సునీత సూచించారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని కార్మిక శాఖ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు ఈశ్రమ్ కార్డుల రిజిస్ట్రేషన్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం కార్మికులు దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కార్మిక కమిషనర్లు జి.రాజు, ఆర్.రమణ, ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు పడాల గోవింద్, ఎస్.మధు, వై.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉడాకాలనీ కమ్యూనిటీ హాలుకు సమకూరిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్

మురళీనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మాధవధార ఉడాకాలనీ నివాసితుల సంక్షేమ సంఘం నిర్వహణలో ఉన్న కమ్యూనిటీ హాలుకు అదనపులోడు సామర్థ్యంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఎస్‌ఎస్‌టీఎల్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ వెంకటేష్ సూచన మేరకు 65 కె.వి. ట్రాన్స్‌ఫార్మర్ సమకూరింది. పాత కమ్యూనిటీ హాలు ఒకే అంతస్థుగా ఉన్నప్పుడు ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌తోనే ప్రస్తుతం రెండు అంతస్థులుగా నవీకరించిన కమ్యూనిటీ హాలు నడుస్తోంది. వేడుకలకు విద్యుత్ లోడ్ అధికంగా అవసరం అవుతుండటంతో రూ.2.5 లక్షలు ఏపీఈపీడీసీఎల్‌కు చెల్లించి కమ్యూనిటీ హాలు పాలకవర్గ సభ్యులు శాశ్వత సదుపాయం కల్పించారు. రెండు ఫ్లోర్లలో రెండు వేర్వేరు ఫంక్షన్లు ఏర్పాటవుతుండటంతో లైటింగ్, ఏసీ, ఫ్యాన్‌లు సహా అదనపు విద్యుత్ వినియోగం కోసం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు.

ఘనంగా అప్పన్న నిత్య కల్యాణం



అప్పన్న కల్యాణానికి మంగళసూత్రాలు చూపుతున్న అర్చకస్వాములు

సింహాచలం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్నస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. సుప్రభాత ఆరాధనలు తర్వాత ఆలయ రాతి రథం మీదనే ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ఉంచి ముఖ్య అర్చకులు నరసింహాచార్యులు భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణాన్ని జరిపారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

పర్వతాల విశిష్టతను తెలిపేది అరణ్యకాండ

ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు



దేవతామూర్తులకు నమస్కరిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

కొమ్మాది, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దేశంలోని నగరాలకు, నదులకు, పర్వతాలకు అధిష్ఠాన దేవతలు ఉంటారని, వారు తప్పక అనుగ్రహిస్తారన్న విషయాన్ని రామాయణం చెబుతుందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కొమ్మాది గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణ ప్రవచనాల్లో భాగంగా మంగళవారం అరణ్యకాండలో శ్రీరాముడు అరణ్యవాసానికి బయలుదేరే సమయంలో చోటుచేసుకున్న ఘటనలను వివరించారు. భరద్వాజ మహర్షి శ్రీరాముడ్ని చిత్రకూట పర్వతం వద్ద నివాసం ఉండమని చెబుతూ ఆ పర్వత శిఖర దర్శనం వల్ల పాపం చేయాలన్న ఆలోచన కూడా రాదని చెప్పడం దేశంలోని పర్వతాల గొప్పతనాన్ని తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు



లలితాపీఠంలో సూర్యనమస్కారాలు చేస్తున్న పండితులు

అల్లిపురం/డాబాగార్డెన్స్/కంచరపాలెం/అక్కయ్యపాలెం/మాధవధార/జగదాంబ కూడలి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నమస్కార ప్రియుడు, ఆరోగ్య ప్రదాత అయిన సూర్యనారాయణ స్వామిని రథసప్తమి సందర్భంగా మంగళవారం ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల ప్రజలు భక్తితో ప్రణమిల్లారు. సూర్యోదయ సమయంలో అర్ఘ్యం సమర్పించారు. ఆలయాలు, గృహాల్లో సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. ఆరుబయట పరమాన్నం వండి నైవేద్యం సమర్పించారు. అల్లిపురం వెంకటేశ్వరమెట్ట అలవేలు మంగమ్మ దేవాలయ ప్రాంగణంలో ఉషా చాయాదేవి సమేత సూర్యనారాయణ స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన అర్చకులు వైఖానస ఆగమ సంప్రదాయంలో పూజలు చేశారు. స్వామికి ప్రీతికరమైన క్షీరాన్నం నివేదించి భక్తులకు పంచిపెట్టారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు. డాబాగార్డెన్స్‌లో ఆలయ ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి సూర్యభగవానుని ఆరాధించారు. గొల్లకంచరపాలెం, రెడ్డికంచరపాలెం, తుమ్మడిపాలెం, సూర్యనగర్,తిక్కవానిపాలెం ఆలయాల్లో భక్తులు పూజలు, సామూహిక సూర్యనమస్కారాలు చేశారు. సూర్యనగర్-2లో గల యోగాసిద్ధాంజనేయ ఆలయంలో స్వామిని సూర్య భగవానుడిగా అలంకరించి, సింధూర అభిషేకం చేశారు. తమలపాకులతో ప్రత్యేక అలంకరణ చేశారు. అక్కయ్యపాలెంలోని లలితాపీఠంలో సూర్య నమస్కారాలు, మహా సౌర అరుణ హోమం నిర్వహించారు. మానవాళికి ఆరోగ్యం, గ్రహదోష నివారణ, సర్వకార్య జయం, ఐశ్వర్యం ఇవ్వాలని ప్రార్థించారు. పోర్టుస్టేడియంలో విద్యార్థులు సామూహికంగా యోగాసనాలు వేశారు. కనకమహాలక్ష్మి ఆలయం పైఅంతస్తు వద్ద పరమాన్నం చేసి సూర్యదేవునికి నైవేద్యం పెట్టి ఆరోగ్యం ప్రసాదించాలంటూ వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో జేఈవో తిరుమలేశ్వరావు, ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు. మాధవధార గాంధీనగర్ రామాలయ ప్రాంగణంలో సూర్యభగవానునికి పంచామృతాభిషేకాలు, సామూహిక అర్చనలు చేపట్టారు. అనంతరం గ్రామ వాసులతో కలసి సామూహిక వంటకం చేయించారు. ఆరుబయట పొయ్యిలో ప్రతి భక్తుడు తలో పిడికెడు బియ్యం వేసి, పరమాన్నం వండి నైవేద్యంగా సమర్పించారు.



అల్లిపురం వెంకటేశ్వరమెట్టపై అలవేలు మంగమ్మ ఆలయంలో సూర్యనారాయణస్వామికి అలంకరణ



కనకమహాలక్ష్మి ఆలయం పైభాగాన పరమాన్నం వండి సూర్యదేవునికి నివేదన ఇస్తున్న దృశ్యం

టీడీఆర్‌ల జారీలో ఆరోపణలపై కలెక్టర్ ఆరా

▸▸ నివేదిక ఇవ్వాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశం

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలో టీడీఆర్‌ల జారీలో అక్రమాలు జరిగాయంటూ వెల్లువెత్తుతున్న ఆరోపణలపై జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హోదాలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ ఆరా తీసినట్టు తెలిసింది. పత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందించిన ఆయన ఆరోపణలకు సంబంధించిన టీడీఆర్‌ల ఫైళ్లు తీసుకురావడంతోపాటు ఆరోపణలపై సంబంధిత అధికారుల వివరణతో కూడిన నివేదిక ఇవ్వాలని చీఫ్‌సిటీ ప్లానర్ ప్రభాకరరావును ఆదేశించినట్టు సమాచారం. మంగళవారం సాయంత్రం చీఫ్‌సిటీ ప్లానర్ ప్రభాకరరావు కలెక్టర్‌ను కలవడంతో టీడీఆర్‌లపై ఆరోపణలకు సంబంధించి వివరణ ఇచ్చేందుకే వెళ్లారని ఆ విభాగం అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఫైళ్లను పరిశీలించి కలెక్టర్ ఒక నివేదికను రాష్ట్రప్రభుత్వానికి పంపించే అవకాశం ఉందని చెబుతున్నారు.

ఉద్యోగం నుంచి తొలగించారని దురాగతం!

▸▸ కేజీహెచ్‌లో పిల్లల వార్డుకు ఆక్సిజన్ అందించే పైప్ కోసేందుకు యత్నం

▸▸ రౌడీషీటర్ సహా నిందితుల అరెస్టు ▸▸ సీఐ దేముడుబాబు వెల్లడి

మహారాణిపేట (విశాఖపట్నం), ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తనను ఉద్యోగం నుంచి తొలగించారనే కోపంతో కేజీహెచ్ పిల్లల వార్డుకు ఆక్సిజన్ అందించే పైపును కత్తిరించేందుకు యత్నించిన రౌడీషీటర్, అతనికి సహకరించిన మరో ఇద్దరిని మంగళవారం అరెస్టు చేసినట్టు వన్‌టౌన్ సీఐ జె.దేముడుబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం...ఏవీఎన్ కాలేజీ డౌన్ ప్రాంతంలో నివాసం ఉంటున్న రాజు కేజీహెచ్‌లో పనిచేసేవాడు. పిల్లలపై అత్యాచారయత్నానికి పాల్పడడం, మద్యం తాగి ఆసుపత్రిలో విధులకు హాజరుకావడం, అనేక నేరారోపణలు రావడంతో అతడిని విధుల నుంచి తొలగించారు. రాజుపై పోలీసులు రౌడీషీట్ కూడా తెరిచారు. ఈ క్రమంలో వైద్యులపై కోపం పెంచుకున్న రాజు కేజీహెచ్‌లోని పిల్లల వార్డుకు ఆక్సిజన్ సరఫరా చేసే పైపులను ఈ నెల ఒకటో తేదీ మధ్యాహ్నం కత్తిరించేందుకు యత్నించాడు. అది గమనించిన సెక్యూరిటీ గార్డులు అడ్డుకునేందుకు యత్నించగా, వారిని కత్తితో బెదిరించి అక్కడ నుంచి పరారయ్యాడు. పిల్లలకు ప్రాణవాయువు (ఆక్సిజన్) అందకుండా చేసి, వారి ప్రాణాలు తీయాలనే దురుద్దేశంతో మరో ఇద్దరి సహాయంతో రాజు ఈ దురాగతానికి తెగబడ్డాడు. ఈ సమాచారం అందుకున్న సీఐ ఆధ్వర్యంలోని పోలీసు బృందం హుటాహుటిన కేజీహెచ్‌కు వెళ్లి సీసీ పుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. వైద్యాధికారుల ఫిర్యాదు మేరకు రాజును, అతనికి సహకరించిన మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ వివరించారు. రాజుపై పలు కేసులు ఉన్నట్టు తెలిపారు.

యూఎల్‌సీ భూముల క్రమబద్ధీకరణకు మరో చాన్స్

... 5వ పేజీ తరువాయి

దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్, పట్టణ భూగరిష్ఠ పరిమితి కాంపిటెంట్ అధికారి కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ జీవో మేరకు 2019 మే ఒకటో తేదీ నాటికి సదరు మిగులు భూమిలో ఉన్నట్టు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఇంటి నిర్మాణం కోసం జీవీఎంసీ నుంచి తీసుకున్న ప్లాన్, కరెంట్ బిల్లు, ఇంటి, నీటి పన్ను రశీదు నకళ్లతో డిసెంబరు 31వ తేదీలోగా క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు సంబంధిత తహసీల్దార్ లేదా కలెక్టరేట్‌లోని యూఎల్‌సీ విభాగంలో అందజేయాలని కోరారు. 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరించి పట్టా ఇస్తారు. 150 నుంచి 300 గజాల వరకు ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువలో 15 శాతం , 300 నుంచి 500 గజాల వరకు 30 శాతం, 500 గజాలు, ఆపైన...అయితే 100 శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఆ మొత్తం లెక్కించి సగం సొమ్మును 'జాయింట్ కలెక్టర్ అండ్ కాంపిటెంట్ అథారిటీ, అర్బన్ ల్యాండ్ సీలింగ్, విశాఖపట్నం పేరిట డీడీ తీసి దరఖాస్తుకు జతచేసి అందజేయాలన్నారు. సందేహాలు, ఇతర వివరాలకు సంబంధిత తహసీల్దారు కార్యాలయంలో సంప్రతించాలని కోరారు. నగరంలో సీతమ్మధార, గోపాలపట్నం, మహారాణిపేట, గాజువాక, ములగాడ, పెదగంట్యాడ, పెందుర్తి, విశాఖ రూరల్ తహసీల్దార్ కార్యాలయాల పరిధిలో 266 హెక్టార్ల యూఎల్‌సీ భూములు ఉన్నట్టు అధికారులు గతంలో నిర్ధారించారు. వాటిలో 86 హెక్టార్లలో ఆక్రమణలు ఉన్నట్టు గుర్తించారు. మరో 100 హెక్టార్ల భూమిని ఇంకా గుర్తించాల్సి ఉండగా, 80 హెక్టార్లలో రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, సామాజిక భవనాలు ఉన్నాయని చెబుతున్నారు. ఆ 86 హెక్టార్లలో సుమారు 3,025 ఆక్రమణలు ఉన్నట్టు అప్పట్లో గుర్తించి 2023 మార్చి తరువాత 1,583 మందికి నోటీసులు ఇచ్చారు. మిగిలిన వారికి నోటీసులు ఇస్తే అప్పట్లో చాలామంది తీసుకోలేదు. 2023 డిసెంబరు 31తో గడువు ముగిసేనాటికి 687 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 150 గజాల కంటే తక్కువ విస్తీర్ణం ఉన్న ఆక్రమణదారులు 643 మంది, 150 గజాల పైబడి విస్తీర్ణం ఉన్నవారు 44 మంది ఉన్నారు. పలు కారణాలతో 150 దరఖాస్తులు తిరస్కరించగా, 150 గజాల కంటే తక్కువ విస్తీర్ణం ఉన్నవి 386, అంతకు మించినవి 44 వెరసి 430 దరఖాస్తులు పరిశీలించి క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వానికి పంపారు. 150 గజాల విస్తీర్ణం పైబడి ఆక్రమణదారులు రూ.3.52 కోట్లు చెల్లించారు. అయితే ప్రభుత్వానికి దరఖాస్తులు పంపినా ఒక్కటి కూడా క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు ఇవ్వలేదు. దరఖాస్తుదారులు కలెక్టరేట్‌కు వచ్చి విచారిస్తూనే ఉన్నారు. చివరకు గత నెలలో జరిగిన క్యాబినెట్‌లో యూఎల్‌సీ ఆక్రమణలపై చర్చించిన మీదట గత నెల 27న జీవో ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన జీవోను యథాతథంగా అమలు చేస్తూ కేవలం దరఖాస్తుల సమర్పణకు డిసెంబరు 31వ తేదీ వరకూ గడువు మాత్రమే పెంచారు.

మహో దుబారా

... 5వ పేజీ తరువాయి

వీలుగా 'ఐ లవ్ వైజాగ్' బోర్డు ఏర్పాటుచేయగా, అది మూన్నాళ్లకే విరిగిపోవడంతో తిరిగి జీవీఎంసీ అధికారులే నిధులు వెచ్చించి కొత్త బోర్డు పెట్టించారు.

కనిపించని బయో రెమిడేషన్

నగరంలోని మురుగునీరు సముద్రంలో కలుస్తుంటుంది. జీ-20 సదస్సుకు వచ్చే ప్రతినిధులు బీచ్‌రోడ్డులో ప్రయాణించినప్పుడు అది చూస్తే నగరంపై ప్రతికూల భావన కలుగుతుందని అధికారులు అనుకున్నారు. అందుకే సాగర్‌నగర్ వద్ద బీచ్‌రోడ్డు కింద నుంచి ప్రవహించే మురుగు నీటి కాలువపై తేలియాడే మొక్కలను పెంచుతామంటూ 'బయో రెమిడేషన్' పేరుతో భారీగా నిధులు ఖర్చుపెట్టారు. పీవీసీ పైపులను కట్ చేసి వాటిల్లో ప్రత్యేకంగా దిగుమతి చేసుకున్న మొక్కలను నాటారు. మురుగునీటి కాలువ బయటకు కనిపించకుండా పైపుల్లో నాటిన మొక్కలు మాత్రమే తెలియాడేలా చేశారు. మొక్కలు మురుగునీటికాలువలోని హానికరమైన వ్యర్థాలతో కూడిన నీటిని తీసుకుంటాయి కాబట్టి, సుందరీకరణతోపాటు సముద్ర జలాల కాలుష్యానికి కూడా చెక్ పెట్టవచ్చునంటూ అధికారులు అప్పట్లో చెప్పుకొచ్చారు. తర్వాత వీటి నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఇప్పుడు అక్కడ మొక్కలు మాత్రమేకాదు...పైపులు కూడా మచ్చుకైనా కనిపించడం లేదు.

వ్యూపాయింట్ వద్ద పాడైపోయిన నడకదారి

సీతకొండ వ్యూపాయింట్ వద్ద సందర్శకులు నడిచేందుకు వీలుగా సముద్ర తీరం వైపు ప్రత్యేకంగా రాళ్ల పలకలతో నడకదారి నిర్మించారు. నిర్మాణంలో నాణ్యత పాటించకపోవడంతో రాతి పలకలన్నీ పైకి లేచిపోయి చిందరవందరగా పడి ఉన్నాయి. ఆ మార్గంలో నడిచేవారు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా సరే వాటిని తన్నుకుని కిందపడిపోయే ప్రమాదం ఉంది. అక్కడకు సమీపంలో తారురోడ్డు కూడా పాడైపోవడం పనుల్లో నాణ్యతాలోపాన్ని తెలియజేస్తోంది.

దిగొచ్చిన కూరగాయల ధరలు

... 5వ పేజీ తరువాయి

రూ.22కి లభిస్తున్నాయి. గ్రీన్ పీస్ (బఠాణీలు) జనవరి మొదటి వారంలో కిలో రూ.100 పైనే విక్రయించారు. ఇప్పుడు కిలో రూ.40కే అమ్ముతున్నారు. బీరకాయలు, బెండకాయల ధర మాత్రం తగ్గలేదు. ప్రస్తుతం బీర కిలో రూ.50, బెండకాయలు కిలో రూ.40 చొప్పున విక్రయిస్తున్నారు. ఇవి మార్కెట్‌కు తక్కువ మోతాదులో రావడంతో మంచి రేటు పలుకుతున్నదని రైతులు చెబుతున్నారు. అల్లం కిలో రూ.100 వరకు ధర పలకగా ఇప్పుడు కొత్తది రావడంతో రూ.44కే ఇస్తున్నారు. నగరంలో ఎక్కువ మంది కూరగాయలు కొనడానికి రైతుబజార్లకే వస్తారు. అయితే ధరలు బాగా తగ్గడంతో రోజువారీ వ్యాపారాలు చేసేవారు టమాటా, ఉల్లి వంటి సరకులు హోల్‌సేల్‌గా కొని ఆటోల్లో వేసుకొని వీధివీధికీ తిరిగి అమ్ముతున్నారు. దాంతో చాలామంది వారి వద్దే కొనుక్కుంటున్నారు. దీంతో రైతుబజార్లపై ఒత్తిడి తగ్గింది. స్టాళ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

నకిలీ బిల్లులతో ఇసుక

... 5వ పేజీ తరువాయి

నగరంలో ఎక్కడకు ఇసుక రవాణా చేస్తుంటారో ఆ వివరాలన్నీ బిల్లులో ఉంటాయి. రీచ్ నుంచి విశాఖపట్నం వరకు మధ్యలో గనుల శాఖ, పోలీసులు, రెవెన్యూ అధికారులు తనిఖీ చేసినప్పుడు బిల్లులు చూపించాలి. కొద్దిరోజులుగా శ్రీకాకుళం జిల్లా నుంచి విశాఖ నగరానికి నకిలీ బిల్లులతో కొందరు లారీ యజమానులు/డ్రైవర్లు ఇసుక తీసుకువస్తున్నారు. రీచ్‌లలో పనిచేసే కొందరు సిబ్బందితో కుమ్మక్కై టన్నుకు అధికారికంగా రూ.200 చెల్లించకుండా ఇసుక లోడ్ చేసుకుంటున్నారు. ఉదాహరణకు 30 టన్నుల లోడ్‌కు రీచ్ నిర్వాహకులకు రూ.6 వేలు చెల్లించాలి. రీచ్‌లో కొందరు సిబ్బంది 30 టన్నుల లోడ్‌కు రూ.3 వేలు మాత్రమే తీసుకుని నకిలీ బిల్లులు ఇస్తున్నారు. ఇంకా రీచ్‌లకు అనుకుని గ్రామాల్లో కొందరు తమ పొలాలు/తోటల్లో నిల్వ చేసిన ఇసుకను విక్రయిస్తున్నారు. వారు బిల్లులు ఇవ్వరు. అటువంటప్పుడు రీచ్‌లలో పనిచేసే కొందరు సిబ్బందితో మాట్లాడి నకిలీ బిల్లులు తీసుకుంటున్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో గడచిన వారం రోజుల్లో గనుల శాఖలో రెగ్యులర్, విజిలెన్స్ అధికారులు, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించి నకిలీ బిల్లులతో ఉన్న ఏడు లారీలను సీజ్ చేశారు. భారీగా జరిమానా విధించారు. అలాగే ఒకే బిల్లుపై రెండు, మూడు రోజులపాటు ఇసుక రవాణా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గనుల శాఖ, విజిలెన్స్ అధికారులు మరింత నిఘా పెంచాలని నిర్ణయించారు.



బాధిత కుటుంబ సభ్యులతో పల్లా శ్రీనివాసరావు, తదితరులు

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన 'పల్లా'

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని ఒమ్మంగి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 71వ వార్డు శ్రీరాంనగర్ దిబ్బపాలేనికి చెందిన దొడ్డి చిన్నారావు భార్య అంజలి, మరో ఇద్దరు బంధువులు మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో తీవ్ర విషాదంతో ఉన్న చిన్నారావు కుటుంబీకులను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని రాష్ట్ర పద్మశాలి సంఘం కన్వీనర్ పప్పు రాజారావు ఎమ్మెల్యేను కోరారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళతానని ఆయన హామీ ఇచ్చారు.

మెడికల్ ఇన్సూరెన్స్ సమస్యను పరిష్కరించాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగుల మెడికల్ ఇన్సూరెన్స్ సమస్యను పరిష్కరించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును సంఘం ప్రతినిదులు కోరారు. గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం పల్లాను సమస్యను విన్నవించారు. మెడకల్ ప్రీమియం రూ.2,600 రూ.20 వేలకు పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఓపీడీ చార్జీల రీయింబర్స్‌మెంట్ సదుపాయం రూ.16 వేల నుంచి రూ.ఎనిమిది వేలకు తగ్గిస్తున్నారన్నారని వివరించారు. తమ సమస్యలను పరిష్కరించాలని, ముఖ్యంగా మెడికల్ సమస్య చాలా పెద్దదని, దీనిపై దృష్టి సారించాలని కోరారు. పల్లాను కలిసిన వారిలో సంఘం ప్రతినిధి కేవీడీ ప్రసాద్, పదవీ విరమణ చేసిన ఉద్యోగులు అప్పలస్వామి, కుంచారావు, నాగేశ్వరరావు, నాగరాజు, ఎల్లయ్య, తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష ఆధ్వర్యంలో మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. సుమారు 150 మందిని వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. క్యాన్సర్ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వారు వివరించారు. కార్యక్రమంలో నాయకుడు గుడివాడ లతీశ్, హైస్కూల్ హెచ్‌ఎం కాంతం, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **మదగజరాజ:** జగదాంబ, సంగం, కామేశ్వరి, వెంకటేశ్వర-1, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
● **మహిష:** రమాదేవి
● **సంక్రాంతికి వస్తున్నాం:** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్:** శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం),కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 29, టమాటా 12, వంకాయలు (తెలుపు)22, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 46, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 42, బీరకాయలు 50, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 10, క్యారెట్ 22 దొండకాయలు 34, బంగాళ దుంపలు 16, అరటి కాయ (పె)7, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది)44, బరబాటి 34, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 24, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, కీరదోస 32, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38 చిలగడ దుంపలు 36, కంద 56, దేముడు చిక్కుడు 28, గోరు చిక్కుడు 26, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	100
లైవ్ ధర	120
విత్ స్కిన్	210
స్కిన్‌లెస్	220

శ్రీగణేశ్ నగర్‌లో కబ్జా పర్వం!

» తొలుత ఇంటి నిర్మాణం చేపట్టిన ఆక్రమణదారులు
» ఇప్పుడు పక్కనున్న స్థలంలో పాగా వేసేందుకు ప్రహరీ నిర్మించారని ఆరోపిస్తున్న కాలనీ అసోసియేషన్ సభ్యులు
» అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వేడుకోలు
» 'ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా'లోనూ ఫిర్యాదు



87వ వార్డు శ్రీగణేష్ నగర్‌లో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ స్థలం

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు కబ్జారాయుళ్లు పేట్రేగిపోతున్నారు. ఈ క్రమంలో 87వ వార్డు పరిధి శ్రీగణేష్ నగర్‌లో పలు ప్రభుత్వ స్థలాలు ఖాళీగా ఉండడంతో పలువురు ఆక్రమణదారులు వాటిపై కన్నేశారు. ఇందులో భాగంలో వడ్లపూడి సర్వే నంబర్-49/4లో శ్రీగణేష్‌నగర్ రోడ్డు నంబర్-1 పక్కన సుమారు 420 గజాల ప్రభుత్వ స్థలం ఉందని, అందుకు సంబంధించి తప్పుడు పత్రాలు సృష్టించి సుమారు 300 గజాల స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టారని కాలనీ అసోసియేషన్ సభ్యులు ఆరోపిస్తున్నారు. అయినా అంతటితో ఆగకుండా ఇప్పుడు మిగిలిన 120 గజాల స్థలాన్ని కూడా ఆక్రమించేందుకు ప్రహరీని నిర్మించారని పేర్కొంటున్నారు. ఈ ఆక్రమణను అడ్డుకునేందుకు కాలనీవాసులు ఆ స్థలం వద్ద ఆందోళన కూడా చేశారు. ఎంతో విలువైన ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు పక్కా స్కెచ్‌తో ప్రహరీని ఆక్రమణదారులు నిర్మించారని కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సరిపల్లి తాతారావు ఆరోపిస్తున్నారు. ఇది ప్రభుత్వ స్థలమని అధికారులు బోర్డులు పెట్టినా, వాటిని తొలగించి తొలగించారని ఆయన ఆరోపిస్తున్నారు. ప్రజా ప్రయోజనాల కోసం అధికారులు ఈ స్థలాన్ని పరిరక్షించి తమకు అప్పగిస్తే గ్రంథాలయాన్ని నిర్మిస్తామని కాలనీవాసులు చెబుతున్నారు. ఈ ఆక్రమణపై తాము ఇప్పటికే ఆర్‌టీఏకు ఫిర్యాదు చేశామని, అయితే వారు రికార్డులు లభ్యం కాలేదని బదులిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ స్థలాన్ని కాపాడాలంటూ కార్పొరేటర్, తహసీల్దార్, జెడ్సీ, జీవీఎంసీ కమిషనర్, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు కూడా అందజేశామని వారు పేర్కొన్నారు.

'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా'లోనూ ఫిర్యాదు

గత నెల 28న తిరుమల నగర్‌లో 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో పాల్గొన్న పలువురు అధికారుల దృష్టికి శ్రీగణేశ్ నగర్ కాలనీవాసులు ఈ సమస్యను తీసుకువెళ్లారు. ఇప్పటిపైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి సర్కారు స్థలాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

స్థలాన్ని మాకిస్తే గ్రంథాలయాన్ని నిర్మిస్తాం

-పిన్నింటి ఆనందకుమార్, శ్రీగణేశ్ నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధి



శ్రీగణేష్‌నగర్‌లో ఉన్న సుమారు 120 గజాల స్థలాన్ని తమకు కేటాయిస్తే అక్కడ ప్రజా ప్రయోజనార్థం గ్రంథాలయాన్ని నిర్మిస్తాం. ఈ విషయంపై ఎమ్మెల్యే, కార్పొరేటర్‌తో పాటు ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

ఆక్రమణపై విచారణ చేపడతాం..

-టి.శ్రీవల్లి, తహసీల్దార్, గాజువాక



గ్రేటర్ 87వ వార్డు పరిధి శ్రీగణేశ్ నగర్‌లో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైనట్టు వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేపడతాం. ప్రభుత్వ స్థలాల ఆక్రమణకు ఎంతటివారు పాల్పడినా ఉపేక్షించబోం. కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలను తొలగించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తాం. వీటిని తొలగిస్తే సహించేది లేదు.

వైభవంగా రథసప్తమి వేడుకలు

» పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పెదగంట్యాడ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కనిపించే దేవుడిగా భావించే సూర్య భగవానుడు జయంతి (రథసప్తమి)ని మంగళవారం పలు ఆలయాల్లో వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 65వ వార్డు గరుడాద్రిపై ఉన్న వేంకటేశ్వరాలయంలోని శ్రీవారు భక్తులకు ఆదిత్యునిగా భక్తులకు దర్శనమిచ్చారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారి పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామివారికి 11 రకాల పిండివంటలను నైవేద్యంగా సమర్పించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. లాభాల దుర్గాప్రసాద్ బృందం అన్నమయ్య సంకీర్తనలను ఆలపించారు. శ్రీనివాస సంకీర్తన కోలాటం మండలి ప్రతినిధి చల్లా మంజుల ఆధ్వర్యంలో కోలాటాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల, సభ్యులు సాలాపు రామారావు, అనూరాధ, వెంకటేశ్, స్వాతి, రామలక్ష్మి నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



65వ వార్డు గరుడాద్రిపై ఆదిత్యునిగా భక్తులకు దర్శనమిచ్చిన వేంకటేశ్వరస్వామి

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ లోపల గల పురాతన శివాలయంలో రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్టీల్‌ప్లాంటుకు, ఉద్యోగులకు, నిర్వాసితులకు అంతా మంచి జరగాలని ఆకాంక్షిస్తూ పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు యేల్లేటి శ్రీనివాసరావు, సీహెచ్ సురేంద్ర, ఎన్.శ్రీనివాస్, కనకరెడ్డి, శశిభూషణ్, కాళిదాసు, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: రథసప్తమిని పురస్కరించుకుని షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన సూర్యప్రభ వాహనంపై శ్రీవారిని అధిష్ఠంపజేసి వేదపండితులు పల్లకీ సేవ చేపట్టారు. మంగళవాయిద్యాలు, కోలాటాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ సూర్యప్రభ వాహనంపై శ్రీవారిని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో ఊరేగించారు. అనంతరం దివ్యక్షేతంలో ప్రత్యేక పూజలు జరిపారు. పాలక మండలి సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.



ఎస్టీబీఎల్‌లో సూర్యప్రభ వాహనంపై స్వామివారి ఊరేగింపు..

పెందుర్తి: చినముషిడివాడలోని శారదాపీఠంలో పీఠాధిపతిలో జరుగున్న వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం రథసప్తమి వేడుకలను జరిపారు. ఆరోగ్య ప్రదాత ఆదిత్యున్ని స్తుతిస్తూ అరుణ పారాయణం సౌర హోమం చేశారు. స్వయంజ్యోతి మండంపంలో సూర్యానారయణస్వామికి ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర హారతులిచ్చారు. యాగశాలలో రాజశ్యామల యాగానికి రుత్వికులు శ్రీకారం చుట్టారు. మన్యుసూక్త సూర్య హోమాలు, చంద్రమౌళీశ్వరులకు పీఠార్చన జరిపారు. అదేవిధంగా చినముషిడివాడ యాజ్ఞవల్క్య పరిషత్ సూర్య దేవాలయంలోని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆలయానికి విచ్చేసి ఆదిత్యున్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పీలా శ్రీనివాసరావు, సేనాపతి వసంత ,రాపర్తి కన్నా, పిల్లా జగన్మోహనపాత్రుడు, తదితరులు పాల్గొన్నారు. సుజాతనగర్‌లోని సూర్యనారాయణస్వామి ఆలయంలో, పాత పెందుర్తి శివాలయంలో పూజలు నిర్వహించారు.

పెందుర్తి-రూరల్: మండలంలోని పురుషోత్తపురం, చీమలాపల్లి, లక్ష్మీపురం, పొర్లుపాలెం, చింతల అగ్రహారం రామాలయాల్లో, చింతల అగ్రహారం బస్టాండ్ కూడలిలో గల శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో రథసప్తమిని సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఆయా ఆలయాలకు విచ్చేసి పూజల్లో పాల్గొన్నారు. గవరపాలెం కాలనీలో గల ఓంకార్ యోగా కేంద్రంలో యోగా గురువులు దాడి సురేశ్, రమ ఆధ్వర్యంలో 108 మంది విద్యార్థులు 108 సార్లు సూర్య నమస్కారాలు చేశారు.



వేపగుంటలో భక్తులతో కలిసి పరమాన్నం వండుతున్న కార్పొరేటర్లు

వేపగుంట: స్థానిక సీతారామాలయంలో రథసప్తమి వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో పూజలు చేసి పరవాన్నం వండి స్వామివారికి నివేదించాక భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, ముమ్మన దేముడు, తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ఆవరణలో జరిగిన పరసలో సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

అగనంపూడి: ఇక్కడి జాబిలి హిల్స్ కాలనీవాసులంతా ఒకచోట సామూహిక సూర్య నమస్కారాలు, ఆదిత్యునికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు రథసప్తమి విశిష్టతను వివరించారు. పలువురు మహిళలు లలిత, విష్ణుసహస్రనామ పారాయణాలను పఠించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు జి.వెంకటరావు, మూర్తి, శంకరరావు, మణి, సూర్యనారాయణ, సాయిరామ్, అమృతరావు, తదితరులు పాల్గొన్నారు.



ఓంకార్ యోగా కేంద్రంలో సూర్య నమస్కారాలు చేస్తున్న దృశ్యం

యువకుడి మృతి కేసులో ఐదుగురి అరెస్టు

గాజువాక, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గాజువాకలోని శ్రీనగర్ ప్రాంతంలో ఈ నెల ఒకటో తేదీన అనుమానాస్పదంగా మృతి చెందిన జి.భాస్కరరావు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాజువాక పోలీసులు మంగళవారం ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీనగర్‌లో నివాసం ఉన్న ఫార్మా ఉద్యోగి భాస్కరరావు ఈ నెల ఒకటిన తమ పక్క ఇంట్లో ఉంటున్న యువతి స్నానం చేస్తుండగా వీడియో తీశాడనే అభియోగంతో ఆ యువకున్ని తీవ్రంగా కొట్టి గదిలో బంధించారు. ఈ విషయాన్ని విజయనగరంలో ఉంటున్న భాస్కరరావు తల్లిదండ్రులకు యువతి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు ఇక్కడకు వచ్చేసరికి భాస్కరరావు ఇంటికి తాళం వేసి ఉంది. దీంతో యువతి కుటుంబ సభ్యులు తీసి లోపలకు వెళ్లి చూడగా భాస్కరరావు అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని కనిపించాడు. తమ కుమారుడిని కొట్టి చంపేసి ఉరి వేసుకున్నట్టు చిత్రీకరించారంటూ భాస్కరరావు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ప్రియాంక, హేమంత్, లక్ష్మి, మణికంఠ, హేమశేఖర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఉక్కు ఉద్యోగికి గాయాలు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పైలాన్ జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉక్కు ఉద్యోగికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కూర్మన్నపాలెంలో నివాసముంటూ ప్లాంటులో ఉద్యోగం చేస్తున్న సీహెచ్ శివకుమార్ మంగళవారం స్టీల్‌ప్లాంట్ పైలాన్ వద్ద ద్విచక్ర వాహనంపై మలుపు తిరుగుతుండగా టీటీఐ జంక్షన్ నుంచి ప్రధాన గేటు వైపు వెళుతున్న కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో శివకుమార్‌కు తీవ్ర గాయాలవ్వడంతో ఉక్కు ఆస్పత్రికి, అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటుకు ఆస్పత్రికి తరలించారు.

1,454వ రోజుకు చేరిన ఉక్కు దీక్షలు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ సిబ్బంది తొలగించడం సరైన చర్య కాదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1,454వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటుపై కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం స్పష్టమైన వైఖరిని ప్రకటించకుండా ద్వంద్వ వైఖరిని అవలంబిస్తుందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

గుదిబండగా మారిన వైసీపీ చేసిన అప్పులు

ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



మాట్లాడుతున్న గణబాబు

గోపాలపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన రూ.వేల కోట్ల అప్పులు కూటమి ప్రభుత్వానికి గుదిబండలా మారాయని ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గోపాపట్నంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల పేరుతో ప్రజలను బురిడీ కొట్టించి ప్రజాధనాన్ని వైసీపీ నేతలు దుర్వినియోగం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెంటు భూమి, సాక్షి పేపరులో ప్రకటనలకు, ప్రచార ఆర్భాటాలకు జగన్ కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రత్యేక స్థానాన్ని కేటాయిస్తున్నారని గణబాబు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన వ్యవస్థల బకాయిలను రానున్న రాష్ట్ర బడ్జెట్ సమావేశంలో ప్రతిపాదన చేసి నిధుల మంజూరుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని ఆయనన్నారు.

బాధ్యతలు స్వీకరించిన స్టీల్ క్లబ్ కార్యవర్గం



కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన పెంటకోట రామకృష్ణ

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్ స్టీల్‌క్లబ్ నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన కార్యవర్గం పాత కమిటీ నుంచి బాధ్యతలు స్వీకరించింది. కార్యదర్శిగా పెంటకోట రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ వై.రవికుమార్, కోశాధికారి డి.వేణుగోపాల్, సభ్యులు పీఆర్ఎస్.రవి, క.రంగనాథం, ఎం.వెంకటరాజు, బి.వెంకటరమణ, జె.రమేష్‌కుమార్, రమేష్, వి.నాగభూషణ్‌రాజులు బాధ్యతలు స్వీకరించారు.



ర్యాలీలో పాల్గొన్న ఏపీ మహిళా సమాఖ్య ప్రతినిధులు

హత్యాచార నిందితుడికి ఉరి తీయాలంటూ ర్యాలీ

సింధియా, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో దళిత యువతిపై హత్యాచారం చేసిన నిందితుడిని ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ 63వ వార్డు పరిధి కాకరలోవ, జైఆంధ్ర కాలనీల్లో మంగళవారం ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మహిలా సమాఖ్య జిల్లా కార్యవర్గ సభ్యురాలు గుడాల జయ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు పూర్తయినా మహిళలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా చట్టాలను తుంగలో తొక్కారని, రోజురోజుకు మహిళలపై అత్యాచారాలు అధికమవుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో మహిళా నాయకులు పి.జయలక్ష్మి, ముత్యాలమ్మ, అచ్చమ్మ, నాగమణి, రమ, పావని, తదితరులు పాల్గొన్నారు.

పైపు లైక్‌లకు లీక్‌లకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పైపు లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పెదగంట్యాడ, ఫిబ్రవరి 4: (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ మెయిన్ రోడ్డు పక్కన ప్రధాన తాగునీటి పైపు లైన్ లీకేజీలకు జీవీఎంసీ అధికారులు మంగళవారం మరమ్మతులు చేశారు. 'వృథాగా పోతున్న తాగునీరు' శీర్షికతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పెదగంట్యాడ ఏపీఈపీడీసీఎల్ సబ్ స్టేషన్ నుంచి కొత్తదిబ్బపాలెం జంక్షన్ వరకు ఉన్న ఆటోనగర్ ప్రధాన రహదారి పక్కన ప్రధాన అండర్‌గ్రౌండ్ తాగునీటి పైపులైన్ ఉంది. ఈ పైపులైన్‌కు రెండుచోట్ల లీకేజీలు ఏర్పడి తాగునీరు వృథాగా పారుతూ కాలువల్లో కలుస్తుంది. ఈ పైపులైన్‌లకు తాగునీటి సరఫరా అధికారులు మరమ్మతులు చేపట్టడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీని మండల కమిటీలు బలోపేతం చేయాలి

జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న పరశురామరాజు

గాజువాక, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీని జిల్లాలో బలోపేతం చేయడంలో మండల కమిటీలు కీలక పాత్ర పోషించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎస్ పరశురామరాజు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రజా సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని, దేశంలో ప్రతిఒక్కరు సుఖ సంతోషాలతో ఉండాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. గాజువాకలో మండల కమిటీల ఏర్పాటును ఈ నెల 15వ తేదిలోగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ గాజువాకలో పార్టీ బలంగా ఉందని, స్టీల్‌ప్లాంటుకు కేంద్రం భారీ ప్యాకేజీ ప్రకటించడం ఆనందదాయకమన్నారు. సమావేశంలో నాయకులు మేడపాటి రవీంద్ర, పి.శ్రీనివాస్, డాక్టర్ గొర్లె సత్యనారాయణ, దీనంకొండ కృష్ణంరాజు, బాటా శ్రీనివాస్, గూటూరు శంకరరావు, బొండా యల్లాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుల పరీక్షలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : టెక్నికల్ సర్టిఫికెట్ పరీక్షలను ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, డ్రాయింగ్ ఎంబ్రాయిడర్ కోర్సునకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. హేండ్లూమ్ వీవింగ్ కోర్సుకు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 19 నుండి 22వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పరీక్షల టైం టేబుల్ ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పెందుర్తి, ఫిబ్రవరి 4: చినముషిడివాడ కూడలి నుంచి పెందుర్తి జంక్షన్‌కు వెళ్లే బీఆర్టీఎస్ ప్రధాన రహదారిలో సోమవారం రాత్రి పది గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఇందుగబిల్లి రాజబాబు (43) మంగళవారం మృతి చెందారు. ద్విచక్ర వాహనం స్కిడ్ అవ్వడంతో రాజబాబుకు తలకు తీవ్ర గాయాలయ్యాయి. రాజబాబు రాంపురం నివాసి. స్థానికులు ఇచ్చిన సమాచార మేరకు పెందుర్తి పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని రాజబాబును కేజీహెచ్‌కు తరలించారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'వైసీపీ బలోపేతానికి కృషి చేయాలి'

అగనంపూడి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ బలోపేతానికి కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ పిలుపునిచ్చారు. మంగళవారం ఇక్కడి కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీ బలంగా ఉందని, బూత్ స్థాయిలో ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. అనంతరం కార్యకర్తలు పూర్ణానందశర్మను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు స్థానిక నేతలు ఎలమంచిలి చిన అప్పారావు, వి.ప్రసాద్, వరహా వెంకటరావు, ఎల్‌వీ రమణ, కృష్ణప్రసాద్, చిత్రా ప్రసాద్, నరసింహరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి తీర్థం



గోపాలపట్నం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నరవ గ్రామంలో అభయాంజనేయస్వామి ఆలయ తీర్థాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేయగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. సాయత్రం తీర్థంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి.

నేడు రోళ్లపైడిమాంబ ఆలయ వార్షికోత్సవం

పెందుర్తి రూరల్, ఫిబ్రవరి 4: జీవీఎంసీ 95వ వార్డు పరిధి చీమలాపల్లి పరిసర గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత రోళ్ల పైడిమాంబ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపడతామని ఆలయ ధర్మకర్త అయితా ఎర్నిబాబు తెలిపారు.

28లోగా ట్రేడ్‌లైసెన్స్‌లు రెన్యువల్ చేయించుకోవాలి

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని వ్యాపారులంతా 2025-26 ఆర్థిక సంవత్సరానికి తమ ట్రేడ్‌లైసెన్స్‌లను ఈనెల 28లోగా రెన్యువల్ చేయించుకోవాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ పరిధిలో 53వేల ట్రేడ్‌లైసెన్స్‌లు ఉన్నాయని, వాటి ద్వారా ఏటా జీవీఎంసీకి రూ.18 కోట్లు ఆదాయం సమకూరుతుందన్నారు. ఇదికాకుండా ఎరియర్స్ కింద మరో రూ.70 కోట్లుపైగా బకాయి ఉందన్నారు. వ్యాపారులంతా సకాలంలో ట్రేడ్‌లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకోనిపక్షంలో శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ఉక్కు'లో తెలుగు అధికారులనే నియమించాలి

» విదసం ఐక్యవేదిక డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న విదసం ప్రతినిధి బూసి వెంకటరావు

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటును కష్టాల నుంచి గట్టెక్కించాలంటే సీఎండీ, డైరెక్టర్లుగా తెలుగువారే ఉండాలని విదసం ప్రతినిధి బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. రేసపువాని పాలెంలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన ఐక్యవేదిక సదస్సులో ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంటుకు ఇటీవల కేంద్రం రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిందని, అందులో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక పాత్ర పోషించారన్నారు. నిధులు సద్వినియోగం కావాలంటే యాజమాన్య ప్రతినిధులను మార్చాలన్నారు. ప్లాంటును ప్రైవేటీకరణ చేయడం లేదని ప్రధాని మోదీతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. ప్లాంటుకు అందించిన ప్యాకేజీ నుంచి ఉద్యోగుల జీతాల చెల్లింపునకు అనుమతించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్, నీటి చార్జీలు పూర్తిగా రద్దు చేయాలని, కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిలిపివేయాలన్నారు. ఈ సమావేశంలో విదసం సభ్యులు సోడదాసు సుధాకర్, ఎం.భాస్కర్, జార్జి, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ఒకేషనల్ ప్రయోగ పరీక్షలు

మద్దిలపాలెం, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఒకేషనల్ ప్రయోగ పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం జిల్లాలో 14 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సరం 1,651, ద్వితీయ సంవత్సరం 1,520 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. నాన్ జంబ్లింగ్ పద్ధతిలో చదువుతున్న కళాశాలలోనే పరీక్షలకు ఏర్పాట్లు చేశారు. పరీక్ష ముగిసిన వెంటనే గదిలోనే మూల్యాంకనం నిర్వహించి, మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. సీసీ కెమెరాలు, స్క్వాడ్ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తామని ఆర్ఐవో మురళీధర్ తెలిపారు.

కునుకు కరవాయె!

సగటు మనిషిని పీడిస్తున్న నిద్రలేమి

- అధిక సెల్‌ఫోన్ వినియోగం, పని ఒత్తిడే కారణం
- ప్రతిరోజూ 8 గంటల నిద్ర అవసరం
- లేదంటే అనేక అనారోగ్య సమస్యలు చుట్టుముట్టే ప్రమాదం
- గుండె, నరాలు, మెదడుపై తీవ్ర ప్రభావం
- యువతలో అధికమవుతున్న స్లీప్ డిజార్డర్

(ఎంవీపీ కాలనీ, ఆంధ్రజ్యోతి)



నిద్ర సరిగా పట్టడంలేదనే మాట ఇటీవల చాలామంది నుంచి వినిపిస్తోంది. ముఖ్యంగా నగర వాసుల్లో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా కనిపిస్తోంది. సుమారు 47 శాతం మంది ప్రజలు నిద్రలేమితో బాధపడుతున్నట్టు సర్వేల్లో తేలింది. పన్నెండు శాతం మంది చాలా ప్రమాదకరమైన నిద్రలేమితో బాధపడుతున్నట్టు గణాంకాలు తేలింది. నిద్రలేమితో తలనొప్పి, అలసట, ఇరిటేషన్, ఏకాగ్రత కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయని తేలినట్టు నిపుణులు పేర్కొంటున్నారు. జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాలకు 40 శాతం నిద్రలేమి కారణమని ఓ నివేదిక స్పష్టం చేసింది.

ఆనందకరమైన జీవనానికి సుఖ నిద్ర అవసరం. గాఢ నిద్రతో పాటు ఎంతసేపు నిరంతరాయంగా పడుకున్నారనేది ఆధారపడి ఉంటుందని వైద్య నిపుణులు చెపుతున్నారు. నగరాల్లో నిద్రలేమి సమస్యపై హైదరాబాద్‌లోని ఏఐజీ సంస్థ ఇటీవల ఓ సర్వే నిర్వహించింది. ఇందులో ఆశ్చర్యకరమైన నిజాలు వెలుగు చూశాయి. తీవ్రమైన నిద్రలేమితో గుండె బలహీనమవడం, నరాలు పటుత్వం కోల్పోవడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, అధిక బరువు వంటి సమస్యలు తలెత్తుతాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో నిద్రలేమి నుంచి ఎంత తొందరగా బయటపడితే ఆరోగ్యానికి అంత మంచిదని సూచిస్తున్నారు.

ఎందుకీ సమస్య

ప్రస్తుత కాలంలో అధికశాతం యువత గాడ్జెట్లతోనే గడుపుతున్నారు. రాత్రి పన్నెండు గంటల వరకు అతి సాధారణం కాగా కొందరు ఒంటి గంట, రెండు గంటల వరకూ ఫోన్‌లతోనే కాలక్షేపం చేస్తున్నారు. ఎంత పని చేసుకుని వచ్చినా, నిద్రకు ఉపక్రమించేటప్పుడు సెల్‌ఫోన్ చూడడం చాలా మందికి దినచర్యగా మారింది. సోషల్ మీడియాలో ఒకదాని తర్వాత ఒకటి రావడం, ప్రపంచమే మన చేతిలో ఇమిడిపోయినట్టుగా అనిపించడంతో దానికి బానిసలవుతున్నారు. దీంతో ఫోన్ పక్కన పెట్టి నిద్రకు ఉపక్రమించాలన్న ధ్యాస లేకుండా పోతోంది. ఫలితంగా నిద్రలేమి సమస్య వెంటాడుతోంది. కొంతకాలం కిందటి వరకు సినిమా చూడాలంటే థియేటర్లకు వెళ్లాల్సి వచ్చేంది. కానీ ఇప్పుడు కొత్త సినిమా విడుదలైన రోజే సెల్‌ఫోన్‌లో ప్రత్యక్షమవుతోంది. మరోపక్క ఓటీటీల్లో వివిధ సినిమాలు, వెబ్ సిరీస్‌లు, ఆన్‌లైన్‌లో పైరసీ సినిమాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో యువత సోషల్ మీడియాతో పాటు సినిమాలు, వెబ్ సిరీస్‌లను చూడడాన్ని వ్యసనంగా మార్చుకుంది. మరో పక్క ఉద్యోగ పరమైన ఒత్తిడి, ఆర్థిక, కుటుంబ సమస్యలు చుట్టుముట్టి సుఖ నిద్రకు దూరం చేస్తున్నాయి.

ఏం చేయాలి

నిద్ర మనిషి శారీరక, మానసిక ఆరోగ్యానికి దివ్యౌషధం. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా, నిర్దిష్ట నిద్ర సమయాన్ని కేటాయించుకోవడం చాలా అవసరం. మనల్ని మనం నియంత్రించుకోగలిగితే నిద్రను ఆహ్వానించవచ్చు. ఎన్ని సమస్యలున్నా నిద్ర తర్వాతే అన్న ఆలోచన అవసరం. ఇందుకు యోగా, మెడిటేషన్ ఉపయోగపడతాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు కలిగించే మాత్రలు, పదార్థాలకు అలవాటు పడకూడదు. నెమ్మదిగా వంద అంకెలను ఏకాగ్రతతో లెక్కపెడితే నిద్ర వచ్చే అవకాశాలు చాలా ఎక్కువని నిపుణులు సూచిస్తున్నారు. మనసులోకి ఎలాంటి ఆలోచనలు రాకుండా చూసుకోవడం నిద్రకు ఉత్తమమైన మార్గం. ముఖ్యంగా రాత్రి తొమ్మిది లేదా పది గంటల తర్వాత ఫోన్ జోలికి వెళ్లకపోవడం, ఇంట్లో ఒక్కరి ఫోన్ మాత్రమే ఆన్‌లో ఉంచుకుని, మిగిలినవి సైలెంట్‌లో పెట్టుకుంటే సమస్య చాలా వరకూ పరిష్కారం అవుతుంది. మరీ ముఖ్యమైన ఫోన్ కాల్ అయితే ఇంట్లో వారి నంబరు అవతలి వారి వద్ద ఉండేలా చూసుకోవాలి. సెలవుల్లో తప్ప ఆన్‌లైన్ సినిమాలు, వెబ్ సిరీస్‌ల జోలికి వెళ్లకుండా ఉండడం ఉత్తమం. నిద్రలో మెలకువ వచ్చిన ప్రతిసారీ సెల్ చూడడం మానుకోవాలి. లేదా నోటిఫికేషన్ వచ్చిన ప్రతిసారీ సెల్‌తీస్తే ఇక అంతేసంగతి.

ఇవీ సమస్యలు

కంటి నిండా నిద్ర కరవైతే ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయి. మనిషికి గాలి, నీరు, ఆహారం ఎంత అవసరమో, నిద్ర కూడా అంతే అవసరం. రోజులో కనీసం ఎనిమిది గంటల నిద్ర ఉండాలి. రోజూ ఒకే సమయంలో నిద్రపోయేలా అలవాటు చేసుకోవాలి. స్లీప్ డిజార్డర్స్ అనే అంశంపై చేసిన సర్వేలో నగరంలో 60 శాతం మంది సరైన నిద్ర లేక ఇబ్బందులు పడుతున్నట్లు తేలింది. రాత్రి నిద్ర సరిగా లేకపోతే పగలు బద్ధకంగా, నీరసంగా అనిపించడం సాధారణం. అలసట, అసహనం, డ్రైవింగ్‌లో నిద్ర రావడం, తలనొప్పి, ఆలోచించలేకపోవడం, సరిగా వినలేకపోవడం, సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం, చేసే పనిలో తప్పులు దొర్లడం, అధిక రక్తపోటు ప్రాథమికంగా కనిపించే లక్షణాలు. నిద్రలేమి కొనసాగితే తీవ్ర అనారోగ్యం దరిచేరి, ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. ముఖ్యంగా గాఢ నిద్ర చాలా అవసరం. లేదంటే గుండె, నరాలు, జ్ఞాపకశక్తి, అధిక బరువు వంటి సమస్యలు తలెత్తుతాయి. అంతే కాదు మానసిక సమస్యలు చుట్టుముట్టే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు.

క్రైం... crime news

మిధిలాపురి కాలనీలో వ్యక్తి ఆత్మహత్య



గణేష్ మృతదేహం

ఎండాడ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని పెయింటర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మిధిలాపురంకాలనీలో మంగళవారం జరిగింది. పీఎం పాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు... విజయనగరం జిల్లా తెర్లాం మండలం పనుకువలసకి చెందిన అలుగుబెల్లి గణేష్ (43) మధురవాడ మిధిలాపురి కాలనీ మానస రెసిడెన్సీలోని ఫ్లాట్ నెంబర్ 103లో గత తొమ్మిది నెలలుగా భార్య శ్రావణి, ఇద్దరు కుమార్తెలు జాహ్నవి, లిఖితతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఇతడు పెయింటింగ్ పనులు చేస్తుండగా, భార్య టైలరింగ్ షాపులో పనిచేస్తోంది. మంగళవారం ఉదయం భార్య టైలరింగ్ షాపునకు, కుమార్తెలు పాఠశాలకి వెళ్లారు. ఆ సమయంలో హాల్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి గల కారణాలు తెలియరాలేదని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఐదుగురు విద్యార్థులను కాపాడిన లైఫ్‌గార్డులు

సాగర్‌నగర్, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): సముద్రస్నానాలకు దిగి ప్రమాదానికి గురైన ఐదుగురు విద్యార్థులను జీవీఎంసీ లైఫ్‌గార్డులు రక్షించారు. మధురవాడలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతూ హాస్టల్‌లో ఉంటున్న ఆరుగురు విద్యార్థులు మంగళవారం సాగర్‌నగర్ బీచ్‌కు వచ్చారు. వారిలో ఒకరు తీరంలో ఉండిపోగా, మిగిలిన ఐదుగురు సముద్రంలోకి వెళ్లారు. స్నానం చేస్తుండగా పెద్దగోతిలో పడిపోయారు. దీనిని గమనించిన తీరంలోని స్నేహితుడు పెద్దగా కేకలు వేయడంతో లైఫ్‌గార్డులు జి.రాజేష్, జి.దేవ, బి.ధనరాజు వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ప్రమాదానికి గురైన వారిలో సంపత్(20), కార్తీక్ (20) నీళ్లు తాగేయడంతో వారికి లైఫ్‌గార్డులు ప్రథమచికిత్స చేశారు. అనంతరం అందరినీ మందలించి పంపించారు.

గుండెపోటుతో హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టు కార్మికుల మృతి

» గ్యాస్ సిలిండర్ మోసుకెళుతూ ఒకరు..

» ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతూ మరొకరు..




రమణ, సూరిబాబు (ఫైల్ ఫొటోలు)

మల్కాపురం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)లో పనిచేస్తున్న ఇద్దరు కాంట్రాక్టు కార్మికులు గుండెపోటుతో మృతి చెందారు. గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లో సోమవారం రాత్రి కొత్తవలస మండలం దేశపాత్రునిపాలెంలోని నరిపల్లికి చెందిన జి.రమణ (45) సిలిండర్ మోస్తూ గుండెపోటుకు గురై కుప్పకూలిపోయారు. దీంతో కార్మికులందరూ పనులు నిలిపివేసి ఆందోళనకు దిగారు. తీవ్రమైన పని ఒత్తిడేనని కారణమని ఆరోపించారు. మృతదేహంతో స్టేషన్ వద్ద ఆందోళనకు దిగడంతో హార్బర్ ఏసీపీ కాళిదాస్, మల్కాపురం సీఐ ఎస్.విద్యాసాగర్, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేశ్, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆర్.అనిల్, సీపీఎం నేతలు లక్ష్మణమూర్తి, పెంటరావు సంస్థ ఉన్నతాధికారులు, గ్యాస్ ఏజెన్సీల యజమాన్యాలతో చర్చలు జరిపారు. దీంతో రూ.14లక్షల పరిహారం ఇవ్వడానికి అంగీకరించడంతో ఆందోళన విరమించారు. అనంతరం రమణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఇదిలా ఉండగా హెచ్‌పీసీఎల్‌లో ప్రైవేటు కారు డ్రైవర్ దొడ్డి సూరిబాబు సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతూ గాజువాక ఆర్టీసీ డిపో వద్ద గుండెపోటుకు గురై మృతి చెందారు. ఉదయం పలువురు ఉద్యోగులను కంపెనీలోని వారి విభాగాలకు చేర్చారు. ఆ తర్వాత గుండె నొప్పిగా ఉండడంతో డిస్పెన్సరీలో వైద్యం చేయించుకోగా, ఈసీజీ చేసి పరిస్థితి బాగోలేదని, మెరుగైన వైద్యం చేయించుకోవాలని వైద్యులు సూచించారు. ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి ఆస్పత్రికి వెళతానంటూ ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. గాజువాక ఆర్టీసీ డిపో వద్దకు వచ్చేసరికి వాహనంపై వాలిపోయి కింద పడి పోయారు. స్థానికులు సమీపంలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు : 4 బైక్స్ స్వాధీనం

ఆరిలోవ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు యువకును అరెస్టు చేసిని వారి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు క్రైం సీఐ చక్రధరరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. హనుమంతవాక జంక్షన్ సమీపంలో గల ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి ప్రాంగణంలో గత ఏడాది మే 25న షెడ్డు నిర్మాణం చేస్తుండగా బొడ్డు శివకృష్ణకు చెందిన నాలుగు సెల్‌ఫోన్లు, ఇయర్ బడ్స్ చోరీకి గురయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆరిలోవ టీబీసీ పాయింట్‌కు చెందని పూడి వంశీ, నిశాంత్‌రెడ్డిలను అదుపులోకి తీసుకొని విచారించారు. అయితే ఈ 4 సెల్‌ఫోన్లతో పాటు నాలుగు బైక్‌లను కూడా నిందితులు చోరీ చేసినట్టు వెల్లడైంది. దీంతో చోరీకి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి 4 బైక్స్, 4 సెల్‌ఫోన్లతో పాటు రూ.39 వేలు స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఆరిలోవ క్రైం ఎస్ఐ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుర్గంధం నివారించేలా చర్యలు తీసుకోవాలి

» నీతి ఆయోగ్ డైరెక్టర్ దూబే



పవర్‌ప్లాంటును పరిశీలిస్తున్న దూబే

కొమ్మాది, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): డంపింగ్ యార్డులో పరిశుభ్రతను పెంచాలని, దుర్గంధం వెలువడకుండా చర్యలు తీసుకోవాలని నీతి ఆయోగ్ డైరెక్టర్ దూబే సూచించారు. కాపులుప్పాడ డంపింగ్‌యార్డును మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి జిందాల్ పవర్‌ప్లాంటును పరిశీలించారు. ఎంత చెత్త సేకరిస్తున్నారు, విద్యుదుత్పత్తి తదితర వివరాలు తెలుసుకున్నారు. రోజుకు 400 టన్నుల చెత్త సేకరిస్తున్నామని, గంటకు 15 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నామని, 13.5 మెగావాట్లు సరఫరా చేస్తుండగా, 1.5 మెగావాట్లను ఇక్కడే వినియోగిస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. ప్లాంటు ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం మారికవలస అన్నక్యాంటీన్, మధురవాడ పీహెచ్‌సీలను ఆయన సందర్శించారు. ఆయన వెంట ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్, ఈఈ శాంతిరాజు, జిందాల్ పవర్‌ప్లాంటు ఈఐ హెచ్‌వోడీ వేణు, మెకానికల్ హెచ్‌వోడీ మూర్తి, హెచ్‌ఆర్‌డీ జీఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భావోద్వేగ మేధస్సుతోనే విద్యార్థుల ఎదుగుదల



అధ్యయన సామగ్రిని విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ నరసింహారావు

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఎదుగుదలలో భావద్వేగ మేధస్సు కీలక పాత్ర పోషిస్తుందని ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు పేర్కొన్నారు. డీన్ వాన్ లెవెన్ సెంటర్ ఫర్ పీస్ స్టడీస్ మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంబ్రేసింగ్ ఎమోషన్స్ అధ్యయన సామగ్రిని ఆయన విడుదల చేశారు. సానుకూల దృక్పథాన్ని పెంపొందిం చడంలో భావోద్వేగ మేధస్సు కీలకమన్నారు. తరగతి గది లోపల, వెలుపల సవాళ్లను ఎదుర్కొనేందుకు ఉపయోగపడుతుందన్నారు. విద్యా సంస్థలు భావోద్వేగ మేధస్సు అభివృద్ధిని తమ పాఠ్యాంశాల్లో చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో డీన్‌వానల్ లెవెన్ సెంటర్ ఫర్ పీస్ స్టడీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ మాట్లాడుతూ సమాజంలో శాంతి, భావోద్వేగ మేధస్సును ప్రోత్సహిం చడానికి కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను వివరించారు.

రఘువర్మకే కూటమి మద్దతు

» ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు » గతపాలకుల నిర్లక్ష్యంతో గాడి తప్పిన విద్యా వ్యవస్థ: రఘువర్మ



నామినేషన్ దాఖలు చేసేందుకు ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ



ఎమ్మెల్సీలు రఘువర్మ, చిరంజీవిరావుతో ఉపాధ్యాయులు, అధ్యాపకులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మకు కూటమి పార్టీలు మద్దతు ఇస్తున్నాయని, ఈ మేరకు త్వరలో ప్రకటన వెలువడుతుందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు పేర్కొన్నారు. ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న రఘువర్మ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న రఘువర్మను మరోసారి గెలిపించాలని పిలుపునిచ్చారు. విశాఖ కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు నామినేషన్ పత్రాలను సమర్పించిన అనంతరం ఎమ్మెల్సీ రఘువర్మ మాట్లాడుతూ వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతోనే విద్యావ్యవస్థ గాడి తప్పిందని ఆరోపించారు. తాను మళ్లీ ఎన్నికైతే విద్యావ్యవస్థను చక్కదిద్దుతానన్నారు. నామినేషన్‌దాఖలుకు ఆరు జిల్లాల నుంచి ఉపాధ్యాయులు, అధ్యాపకులు, అభిమానులు భారీగా తరలిరావడం గొప్ప విజయమన్నారు. ఉపాధ్యాయ సమస్యలతోపాటు ఇతర సమస్యలు పరిష్కరిస్తానన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి తనకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు. అంతకుముందు జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ఊరేగింపు నిర్వహించారు. నామినేషన్ దాఖలు అనంతరం దండుబజార్‌లోని ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో సమావేశం నిర్వహించిన నాయకులు రఘువర్మను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల, కార్యదర్శి భానుమూర్తి, ఆరు జిల్లాల నాయకులు, టీచర్లు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ఘనంగా రథసప్తమి

సింహాచలం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహ స్వామి సన్నిధిలో మంగళవారం రథసప్తమిని త్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏటా మాఘ శుక్లపక్ష సప్తమి సూర్య జయంతి సందర్భంగా ఆలయంలోని పురాతన రాతిరథంపై ఉత్సవాన్ని నిర్వహించడం ఆచారం. ఈ క్రమంలో వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో రాతిరథంపై అధిష్ఠింపజేశారు. స్థానాచార్యులు డా.టీపీ రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐవీ రమణాచార్యులు సారథ్యంలో ఉపప్రధానార్చకులు కరి సీతారామాచార్యులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములతో ఉత్సవానికి శ్రీకారం చుట్టారు. ఉషా, ఛాయాపద్మినీ సమేతుడైన సూర్యభగవానుని భావన చేస్తూ తొలుత పసుపు ముద్దలను అద్దారు. పండ్ల రసాలు, పంచామృతాలు, పవిత్ర గంగధార జలాలతో అభిషేకాలు చేశారు. పండితులు చతుర్వేదాలు, సౌరపారాయణ చేశారు. అనంతరం సుగంధభరిత పుష్పామాలికలు, స్వర్ణాభరణాలతో స్వామిని అలంకరించి షోడశోపచారాలు సమర్పించారు. సూర్యనారాయణ అష్టోత్తర శతనామావళితో అర్చనలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈవోలు నక్కాన ఆనందకుమార్, పిళ్లా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



అభిషేకాలు చేస్తున్న అర్చకులు

అప్పన్నకు సూర్యప్రభ వాహన సేవ

వరాహలక్ష్మీనృసింహస్వామికి మంగళవారం సూర్యప్రభ వాహన సేవ జరిపారు. సూర్యజయంతిని పురస్కరించుకుని సాయంత్రం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై అధిష్ఠింపజేశారు. కోలాటాల మధ్య మాడవీధుల్లో తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులకు కర్పూర నీరాజనాలిచ్చి స్వాగతించారు.



ఆయుష్మాన్ భారత్ ఆధ్వర్యంలో యోగాసనాలు



బీచ్‌లో విన్యాసాలతో అలరించిన మహిళలు



ఏయూ యోగా విలేజ్ విద్యార్థులు ఆసనాలు

సాగర తీరాన యోగాసనాలు

రథ సప్తమిని పురస్కరించుకుని బీచ్ రోడ్డులో మంగళవారం పలుచోట్ల యోగాసనాలను నిర్వహించారు. బీచ్‌లో మహిళలు యోగాసనాలు వేయగా, సబ్‌మెరైన్ ఎదురుగా ఉన్నస్థలంలో ఆయుష్మాన్ భారత్ ఆధ్వర్యంలో సామూహిక సూర్య నమస్కారాలను చేశారు. ఆంధ్ర యూనివర్సిటీ యోగా విలేజ్‌లోనూ రథ సప్తమి వేడుకలను నిర్వహించారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులతోపాటు అధ్యాపకులు, టీచింగ్ సిబ్బంది యోగాసనాలు వేశారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి